జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 4 సంచిక - 15 పక్షపత్రిక ఆగస్టు 16-31, 2013



హైదరాబాద్‌లో లోక్‌సత్తా రౌండ్‌టేబుల్

## అన్ని ప్రాంతాలకు మంచి జరగాలి



## ఎన్నికల హామీలలో అనుచిత ఉచితాలు వద్దు - ఈసీ

## ఉచిత హామీలపై ఆంక్షలను సహించం - పార్టీలు




కూకట్‌పల్లిలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న డా॥ జేపీ



కూకట్‌పల్లిలో మొక్కలు నాటే కార్యక్రమంలో డా॥ జేపీ



లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో
జాతీయ జెండా ఆవిష్కరణ

జన రాజకీయం కోసం...

లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఆగస్టు 16-31, 2013

సంపుటి - 4 సంచిక - 15

## లోపలి పేజీల్లో...

ఎన్నికల హామీలలో అనుచిత ఉచితాలు వద్దు - ఈసి ఉచిత హామీలపై ఆంక్షలను సహించం - పార్టీలు .......5

రాష్ట్ర విభజన కాంగ్రెస్ పార్టీ సొంత వ్యవహారమా?....7

మంచి ఫలితాలిచ్చేలా విభజన ఉండాలి...................... 9

రాయలసీమ, కోస్తాంధ్ర భరోసానిచ్చేందుకు లోక్‌సత్తా రౌండ్‌టేబుల్ సమావేశం..................................12

రాష్ట్రంలో జలవనరులు - కేటాయింపులు..................... 14

బాండ్ల రూపంలో అప్పులు రూ.71 వేల కోట్లు.............19

ఉద్యోగుల బదలాయింపులు - మార్గదర్శకాలు.............20

పద్ధతి ప్రకారం పంజాబ్ విభజన.................................. 21

మూడో ఫ్రంట్‌కు అవకాశాలు....................................... 23

ప్రజా సమస్యలు పరిష్కార విధానం - యువత............ 24

విలువలతో కూడిన సురాజ్యానికి కృషి........................ 26

సర్పంచులుగా ఎన్నికైన లోక్‌సత్తా అభ్యర్థులు............ 28

సురేష్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి...................... 30

జిల్లాలలో లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలు...................... 29

సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# పార్టీల అనుచిత వైఖరి

## సంపాదకీయం

దేశంలో గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు బహుళ సంఖ్యలోనే వున్నాయి. పార్టీలలో భిన్నత్వం, జెండాలలో భిన్నత్వం తప్ప వాటి నడకలో మాత్రం భిన్నత్వం లేకపోగా కీలక సంస్కరణల మీద అది ఏకత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. పార్టీల వ్యవస్థని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి.

నేరచరితుల్ని పోటీకి అనర్హుల్ని చెయ్యాలంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్యానించి ఆ మేరకు ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని పార్లమెంటు సవరించాలని సూచిస్తే లోక్‌సత్తా తప్ప ఒక్క పార్టీ కూడా దానిని స్వాగతించలేదు.

అలాగే రాజకీయ పార్టీలు ప్రయివేటు ఆస్తులు కావని వాటి ఆదాయ వ్యయాలు ఎన్నికల పద్ధతి వగైరాలు తెలుసుకునే హక్కు ప్రజలకు వుందని వాటికి సమాచార హక్కు చట్టం వర్తిస్తుందని కేంద్ర సమాచార కమీషన్ ప్రకటిస్తే ఈ పార్టీలన్నీ ముక్తకంఠంతో ఖండించాయి. పార్లమెంటులో స.హ చట్టానికి తగు సవరణలకు పూనుకున్నాయి.

ఎన్నికల ప్రణాళికలలో పార్టీలు ఇస్తున్న అనుచితఉచితాలను కట్టడి చెయ్యాలని, ప్రజల్ని ప్రలోభపెట్టే ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి హాని చేస్తుందని, సమన్యాయంతో సాగాల్సిన ఎన్నికలకు విఘాతం కల్పిస్తాయని దీనిపై భారత ఎన్నికల కమిషన్ అన్ని పార్టీలతో సంప్రదించి ఎన్నికల నియమావళిలలో భాగంగా ఎన్నికల ప్రణాళికలకు తగు మార్గదర్శకాలను రూపొందించాలని సుప్రీంకోర్టు సూచనల పట్ల ఇదే వైఖరిని ఈ పార్టీలు ప్రదర్శించాయి.

ఇందుకోసం ఎన్నికల కమిషన్ తాజాగా నిర్వహించిన రాజకీయ పక్షాల సమావేశంలో అందరూ దీనిని వ్యతిరేకించారు.

అనుచిత ఉచితాల నియంత్రణ పార్టీల స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని, ఎవరెలాంటి వాగ్దానాలు చేసినా వాటిపై ప్రజలు తమ తీర్పు ద్వారానే నిగ్గు తేలుస్తారని బుకాయిస్తున్నారు. ప్రజాకర్షణ పథకాల క్షుద్ర కళకు ఈ పార్టీలు అంకితమైనాయి. ఎన్నికల్లో ఒక వ్యక్తి నేరుగా డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలు పంపకం చేయడం అవినీతి. కాని అదే ఒక పార్టీ తన సొమ్ము కాకుండా ఎన్నికల్లో వాగ్దానాల పేరుతో ప్రజాధనాన్ని ఓట్లకోసం నేరుగా ప్రజలకు అందిస్తామని ప్రకటించడం, గెలిచిన వాళ్లు ప్రభుత్వ సొమ్మును ఓటర్లకు ధన, వస్తు రూపాల్లో అందించడం అక్రమం కాదని వాదిస్తున్నారు. సంక్షేమానికి, జనాకర్షణకీ మధ్య తేడాని ఈ పార్టీలు చూడ నిరాకరిస్తున్నాయి. కలర్ టీవీలు, మిక్సీలు, గ్రైండర్లు, ఫ్యాన్లు, సెల్‌ఫోన్లు, తాళిబొట్లు వెనక వున్న సంక్షేమం ఏమిటో వారే చెప్పాలి. ఎన్నికల్లో కోట్లు పెట్టుబడి, అధికారంతో అవినీతిలో రాబడి, ప్రజల్ని ప్రలోభ పెట్టే జనాకర్షణ చుట్టూ పరిభ్రమించడమే ఈ పార్టీల రాజకీయం ఇదో క్షుద్ర రాజకీయం. డబ్బు చుట్టూ తిరిగే ఎన్నికల వ్యవస్థను వదిలించుకోవాలి. ప్రభుత్వ ధనంతో ఓటు బ్యాంకులు నడిపే అనుచితాలపై కొరడా ఝుళిపించాలి. అందుకు పార్టీలు సిద్ధం కాకపోతే ఈ రాజకీయం మార్చడానికి ప్రజలే సిద్ధపడాలి. ■

# కార్టూన్ కార్నర్



శిక్ష పడిన వివిపికి కేటాయించిన సెల్ ఎక్కడ
ఈ సామాను అక్కడ పెట్టమని చెప్పారు సార్.....

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం.13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*

**ఫోన్ నంబర్లు :**
***040- 23311817, 23311819, 23311820, 23312829***
**ఫ్యాక్స్ : *040-23310612***

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# ఎన్నికల హామీలలో అనుచిత ఉచితాలు వద్దు - ఈసీ
# ఉచిత హామీలపై ఆంక్షలను సహించం - పార్టీలు

ఉచిత హామీల ప్రకటనల పై దేశంలోని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఒకే తాటిపై నిలిచాయి. ఎన్నికల ప్రణాళికల్లో ఉచిత హామీలను నియంత్రించ డానికిగానీ, నిషేధించడానికి గానీ అవి ససేమిరా అంటున్నాయి. పార్టీలు ఇస్తున్న ఉచిత వరాలకు సంబంధించి మార్గదర్శకాలు రూపొందించాలని సుప్రీం కోర్టు గత నెల 5న ఎన్నికల సంఘానికి ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై రాజకీయ పక్షాల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం దేశంలోని 5 జాతీయ, 23 ప్రాంతీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. జాతీయ పార్టీల్లో ఒక్క బహుజన్ సమాజ్ పార్టీ మాత్రమే ఉచిత హామీలకు వ్యతిరేకంగా తన వాణి వినిపించింది. ఎన్నికలకు ముందు పార్టీలు ఉచిత హామీలు ఇవ్వడాన్ని నిషేధించాలని కోరింది. ఇలాంటి హామీల వల్ల ఓటర్లు ప్రలోభాలకు గురయ్యే అవకాశం ఉందని, అభ్యర్థుల మధ్య సమానావకాశాల స్ఫూర్తికి భంగం కలుగుతుందని అభిప్రాయపడింది. పై పెచ్చు ఆ హామీలు తర్వాతి దశలో అమలు కాకపోవచ్చని కూడా చెప్పింది. ప్రాంతీయ పార్టీల్లో నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్), మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్)లు కూడా ఉచిత వరాలు నిషేధిస్తూ మార్గదర్శకాలు రూపొందించాలని కోరాయి. మిగిలిన అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఉచిత హామీలపై మార్గదర్శకాల ప్రతిపాదనను నిర్ద్వందంగా తిరస్కరించాయి. కాంగ్రెస్, భాజపా, వామపక్షాలు ఎన్నికల ప్రణాళికలపై ఎలాంటి నియంత్రణా ఉండరాదని స్పష్టం చేశాయి. హామీలు పార్టీల హక్కని పేర్కొన్నాయి. సమావేశంలో ఆయా పార్టీలు, వాటి ప్రతినిధులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఇవీ...

**రాజకీయ మూలాలకే దెబ్బ : సీపీఎం**

"ఎన్నికల ప్రణాళిక పార్టీ హక్కు. పార్టీల ఎన్నికల ప్రణాళికల్లోని అంశాల్లో జోక్యం చేసుకునే హక్కు ఎన్నికల సంఘానికి గానీ, న్యాయవ్యవస్థకు గానీ ఉండకూడదు. అలాంటి జోక్యం రాజకీయ పార్టీ వ్యవస్థ మూలాలకే ముప్పు తెస్తుంది. తమ లక్ష్యాలు, విధానాలు, కార్యక్రమాలను ప్రకటించుకోవడం పార్టీల హక్కు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, నిరు పేదలకు భూమి ఇస్తామనడంలో తప్పేముంది?".

**అది పార్టీల హక్కు : భాజపా**

"దేశం పట్ల తన భవిష్యత్ దృక్పథాన్ని ఎన్నికల ప్రణాళికలో పేర్కొనే హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పార్టీకి ఉంటుంది. దేశాన్ని పాలించేందుకు ఏ రాజకీయ పార్టీని ఎన్నుకోవాలన్నది ప్రజల ఇష్టం. ఉచిత ల్యాప్‌టాప్‌లు, సైకిళ్లు, పేదలకు మందులు



ఢిల్లీలో అన్ని పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర ప్రధాన ఎన్నికల కమీషనర్ వి.ఎస్. సంపత్

తదితరాలన్నీ పేదల సంక్షేమానికి ఉద్దేశించినవే. ఎన్నికల్లో డబ్బు, అధికార దుర్వినియోగాన్ని ఈసీ మరింత సమర్థంగా కట్టడి చేస్తే చాలు".

**ప్రజలనే నిర్ణయించనివ్వండి : తెదేపా**

రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల్లో చెప్పే 'ఉచిత' హామీలను నియంత్రించే విషయమై... ఎన్నికల సంఘం (ఈసీ) అన్ని రాజకీయ పార్టీలతో సమావేశమైంది. తెదేపా తరపున ఆ పార్టీ నేత పెద్దిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన ఇక్కడి విజయ్‌చౌక్‌లో మాట్లాడారు. పార్టీలు ప్రకటించే ఎన్నికల ప్రణాళికల్లోని హామీలపై తుది నిర్ణయం ప్రజలకే వదిలేయాలని, వారికి నమ్మకం ఉంటే ఆయా పార్టీలకు ఓట్లేస్తారని, లేకుంటే తిరస్కరిస్తారని ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు తెలిపాయన్నారు. దీన్ని తెదేపా అంగీకరించిందన్నారు. ■

**సమాచార హక్కు చట్టం పరిధిలోకి పార్టీలు రాకుండా లోక్‌సభలో బిల్లు**

రాజకీయ పార్టీలను సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకొస్తూ కేంద్ర సమాచార కమీషన్ (సీఐసీ) ఇచ్చిన తీర్పునకు చెల్లు చెప్పేలా.. ప్రభుత్వం లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టింది. 1951 ప్రజా ప్రతినిధ్య చట్టం ప్రకారం నమోదైన లేదా గుర్తింపు పొందిన వ్యక్తులు లేదా సంస్థ లేదా సంఘాన్ని ప్రభుత్వసంస్థగా పరిగణించజాలరని ఓ వివరణను సమాచార హక్కు సవరణ బిల్లు – 2013లో చేర్చారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద గుర్తింపు పొందిన పార్టీల స్థితిని ఏ కోర్టు / కమీషన్ తీర్పు లేదా ఉత్తర్వులు లేదా ఆదేశాలు మార్చజాలవని సవరణ బిల్లులో ప్రభుత్వం పేర్కొంది. కాంగ్రెస్, భాజపా, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, ఎన్సీపీలు సమాచార హక్కు చట్టం పరిధిలోకే వస్తాయని జూన్ 3న సీఐసీ తీర్పు చెప్పిన సంగతి తెలిసిందే. అదే తేదీ నుంచి సవరణ చట్టం వర్తించనుంది.

# ఉచితాలపై పార్టీల తీరు అనుచితం: లోక్‌సత్తా

ఎన్నికల ప్రణాళికలో ఇష్టమొచ్చిన ఉచితాల హామీలనివ్వవచ్చని, వీటిని నిరోధించటమంటే పార్టీల హక్కుల్ని హరించటమేనని కాంగ్రెస్, బీజేపీ సహా దేశంలో గుర్తింపు పొందిన దాదాపు అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలు చెప్పటం అనుచితమని, ప్రజావ్యతిరేకమని లోక్‌సత్తా పార్టీ విమర్శించింది. సంక్షేమం ముసుగులో జనాకర్షక పథకాలను అమలుచేస్తూ ప్రజల్ని ఓటువేసే యంత్రాలుగా తయారుచేసిన పార్టీలు తమ సాంప్రదాయ రాజకీయాన్ని కొనసాగించుకోవటానికే ఈ రకమైన వాదనలు చేశాయని, పార్లమెంటులోని ప్రధానపార్టీలన్నీ ఈ దిశగా ఏకమవటం క్రియాశీల ప్రజాస్వామ్యానికి దుర్దినమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ అన్నారు.

గతంలో పార్టీలు ఓట్ల కోసం సొంత డబ్బుతో డబ్బు, మద్యం పంచుతూ ఎరలు వేసేవని, దానికి అదనంగా ఇటీవల సంక్షేమం పేరుతో ఓటర్లకు వ్యక్తిగత లబ్ధి చేకూర్చే పథకాలతో ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని వర్మ అన్నారు. అందరికీ ఉచిత విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలను కల్పించటాన్ని, అవకాశాలు అందనివారికి, వృద్ధులు, వికలాంగులకు ఉచిత బియ్యం, వసతి వంటివి అందించటాన్ని ఎవరూ తప్పుపట్టాల్సిన పనిలేదని అన్నారు. పార్టీలిస్తున్న టీవీలు, మిక్సీలు, సెల్‌ఫోన్లు, తాళిబొట్లు వంటి ఎన్నికల హామీలలో ఏ రకమైన ఉమ్మడి ప్రయోజనం, ప్రజాసంక్షేమముందని ప్రశ్నించారు.

ఇలాంటి హామీల్ని ఎన్నికల ప్రణాళికలో ప్రకటించటాన్ని ఖచ్చితంగా అడ్డుకోవాలని వర్మ డిమాండ్ చేశారు. ఈ దిశగా ఎన్నికల సంఘం నిబంధనలను అమలు చేయాలన్నారు. దీనికోసం కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో సంక్షేమ పథకాలకు పెట్టే ఖర్చు మీద ద్రవ్యలోటుకు ఉన్నట్టే స్పష్టమైన పరిమితి ఏర్పాటు ఉండాలన్నారు.

ఎన్నికల్లో కోట్లు ఖర్చుపెట్టటం, అధికారంతో అంతకుమించి దండుకోవటం, ఓటుబ్యాంకులకు జనాకర్షణ పథకాలను ప్రకటించటమే రాజకీయంగా ఈ ఎన్నికల వ్యవస్థ మార్చివేసిందని, దాని స్థానంలో దామాషా ఎన్నికల వ్యవస్థను తేవటం, ప్రజాచైతన్యం కీలకమని వర్మ పేర్కొన్నారు. అందువల్ల ఈ ఎన్నికల వ్యవస్థను మార్చి దామాషా ఎన్నికల వ్యవస్థను తీసుకొస్తే కొంతవరకు జనాకర్షకపథకాలను కట్టడి చేయవచ్చు. దాంతోపాటు 'మాకు కావలసింది రాయితీలు కాదు, నిజమైన సంక్షేమ కార్యక్రమాలు, ఎదిగే అవకాశాలు' అని ప్రజలే తిరగబడి ఆ రాజకీయాన్ని ఓడించటం కీలకం" అని డి.వి.వి.ఎస్ వర్మ ఒక ప్రకటనలో అన్నారు. ■

# రాష్ట్ర విభజన కాంగ్రెస్ పార్టీ సొంత వ్యవహారమా? ప్రధాని, హోంమంత్రి మౌనాన్ని నిలదీసిన జేపీ

రాష్ట్ర విభజన విషయంలో నిర్ణయం ఏదైనా అందులో అందర్నీ భాగస్వాముల్ని చేసేలా చేయటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, ఆంధ్రప్రదేశ్ తమ సొంత ఎస్టేట్ అన్నట్టు వ్యవహరిస్తూ కేంద్రం నిర్ణయాన్ని అమలు చేసే ప్రయత్నం చేయటం వల్లే రాష్ట్రంలో సంక్షోభం తీవ్రతరమైందని, ఈ పరిస్థితికి కాంగ్రెస్ పార్టీ, ఈవేళ్టి కేంద్రప్రభుత్వం చరిత్ర ముందు దోషిగా నిలబడాల్సిందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కేంద్రప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతంలో ఆందోళనలు చెలరేగుతుంటే అభ్యంతరాలు వినేందుకు రాజ్యాంగబద్ధ కమిటీ కాకుండా సొంత పార్టీ నేతలతో కమిటీ వేస్తారా? ఇదేమన్నా కాంగ్రెస్ పార్టీ సొంత వ్యవహారమా? రక్షణమంత్రి ఆంటోనీ నేతృత్వంలోని ఆ కమిటీ ముందుకు ఇతర పార్టీలు వెళ్లి వాదనలు వినిపించాలా? హిందీ తర్వాత అతిఎక్కువ మంది, కోట్లాదిమంది మాట్లాడే తెలుగు భాషా రాష్ట్రాన్ని విభజిస్తున్నామన్న కనీస స్పృహయినా ఉందా? అని జేపీ మండిపడ్డారు. ఇంత జరుగుతుంటే, తెలుగువారి మధ్య రోజురోజుకీ అగాధం పెరిగిపోతుంటే ప్రభుత్వంలో కీలకస్థానంలో ఉన్న ప్రధానమంత్రి, హోంమంత్రి ఒక్కమాట కూడా ఎందుకు మాట్లాడటం లేదు అని నిలదీశారు.

**తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు కేంద్రప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సీమ, కోస్తాంధ్రలో ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో పార్టీ ఉపాధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మతో కలిసి జయప్రకాష్ నారాయణ్ ఆగస్టు 9 వ తేదీన ఇక్కడ లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.**

**జేపీ మాట్లాడుతూ...** అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే రీతిలో రూపొందించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అద్భుతమైనదని, ఇలాంటి రాజ్యాంగ రూపకల్పన చేసిన కాంగ్రెస్ పార్టీ ఈవేళ అందరినీ విశ్వాసంలోకి తీసుకోకుండా, అన్ని ప్రాంతాల ప్రజల ప్రయోజనాలని కాపాడుతున్నామన్న నమ్మకం కలిగించకుండా నిర్ణయాన్ని ప్రకటించి తెలుగువారి మధ్య చిచ్చును ఎగదోసిందని అన్నారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలోని తమ పార్టీ వారిని, ఇతర పార్టీల వారిని, రాజ్యాంగ నిపుణులను, మేధావులను సంప్రదించి నిర్ణయం తీసుకుంటే వచ్చే ఓట్ల కంటే ప్రజల మధ్య చిచ్చుపెట్టటం వల్లే ఎక్కువ ఓట్లు వస్తాయన్న భావనతోనే కాంగ్రెస్ ఏకపక్షంగా నిర్ణయాన్ని ప్రకటించిందని, కోస్తాంధ్రలో కాంగ్రెస్ పార్టీకి నూకలు చెల్లాయన్న సంకేతాలు గత కొంతకాలంగా వస్తుండటం వల్లే రాజకీయ లబ్ధి కోసం ఈ తరహాలో భావోద్వేగాలని, ఆందోళనని రెచ్చగొట్టే తీరున, ఏ రకమయిన ముందు జాగ్రత్తలు లేకుండా నిర్ణయాన్ని ప్రకటించారని ధ్వజమెత్తారు.

తెలంగాణ అంశంపై కూడా అసెంబ్లీలో చర్చించాలని, మన రాష్ట్రానికి సంబంధించిన సమస్య మీద మన అసెంబ్లీలోనే సామరస్యంగా ఒక పరిష్కారాన్ని సాధించుకుందామని చెప్పింది లోక్‌సత్తా పార్టీ ఒక్కటేనని, ఆ మాటను ప్రభుత్వం, ఇతర పార్టీలు కూడా వినిపించుకోలేదని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటుతో పరిష్కరించాల్సిన సమస్యలని ఇప్పుడు హడావుడిగా ఏకరువు పెడుతున్న ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. 14 (ఎఫ్) తొలగింపునకు అసెంబ్లీలో నోటీసు ఇచ్చింది లోక్‌సత్తా పార్టీయేనని, తర్వాత ప్రభుత్వం దిగివచ్చి ఆ నిబంధనను తొలగించిందని గుర్తుచేశారు.

**ఉద్యోగులూ! సమ్మెకు దిగొద్దు, సీమ, కోసాంధ్ర ప్రజలకు నష్టం కలిగించొద్దు**

విద్వేషాలను రెచ్చగొట్టి తమ రాజకీయ ప్రయోజనాలను ఉపయోగించుకునేందుకు నేతలు ప్రయత్నిస్తున్నారని, సీమ, కోసాంధ్రలోని ప్రజలు, ముఖ్యంగా యువత ఈ రాజకీయ క్రీడలో పావులు కావద్దని జేపీ పిలుపునిచ్చారు. "ఎలాంటి అభ్యంతరాలు, ఆవేదనలున్నా, స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యయుతంగా వ్యక్తం చేయండి కానీ, హింసకు, దహనకాండకు, ఆటంకాలకు, ఆర్థికాభివృద్ధిని

దెబ్బతీసే బంద్‌లకు, విగ్రహాల ధ్వంసానికి పాల్పడవద్దు. తెలుగువారి మధ్య విద్వేషాలు సృష్టించి లబ్ధి పొందాలనుకునే రాజకీయ వికృత క్రీడలో పావులు కావద్దు" అని కోరారు. సీమాంధ్ర ప్రజల ప్రయోజనాల పేరుతో సమ్మెకు దిగవద్దని, దీనివల్ల ఆ సీమాంధ్ర ప్రజలే తీవ్రంగా నష్టపోతారని ప్రభుత్వోద్యోగులనుద్దేశించి జేపీ అన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమంలో ప్రభుత్వోద్యోగులు చేసిన సమ్మె వల్ల తెలంగాణ ప్రజలు, విద్యార్థులే నష్టపోయారని, ఇప్పుడు అదేపని సీమాంధ్రలో కూడా చేసి అక్కడి ప్రజల్ని దెబ్బతీయవద్దని విజ్ఞప్తి చేశారు. ముఖం మీద కోపంతో ముక్కు కోసుకోవద్దన్నారు. ఉద్యోగులకు కులం, మతం, ప్రాంతం వంటి భావాలు ఉండకూడదని, వాళ్లు ఎక్కడ పనిచేసినా ప్రజలందరికీ సేవకులు మాత్రమేనని స్పష్టంచేశారు. వివిధ ప్రాంత ఉద్యోగులు యుద్ధవాతావరణం సృష్టించే తరహా ఆందోళనలకు దిగవద్దని, తమ భయాల్ని వారు ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకు తెలియచేయవచ్చని, ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అందరం కలిసి కృషిచేస్తామని తెలిపారు.

## సమగ్ర, సామరస్య పరిష్కారంలో లోక్‌సత్తా భాగమవుతుంది, 10న రౌండ్‌టేబుల్ సమావేశం

సమగ్ర చర్చ, సామరస్య పరిష్కారంలో భాగమవుతామని లోక్‌సత్తా తొలినుంచీ చెబుతోందని, ఆ దిశగా కృషిని ఇప్పుడు ముమ్మరం చేస్తామని జేపీ తెలిపారు. తెలుగువారు ఎన్ని రాష్ట్రాలైనా, తెలుగుజాతంతా ఒక్కటేననే భావాన్ని బలోపేతం చేసేలా ఈ అంశంలో సమగ్ర చర్చతో సామరస్య నిర్ణయాన్ని సాధించేందుకు లోక్‌సత్తా తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తుందని, పార్టీలకతీతంగా, పార్టీలతో కలిసి కూడా ఈ ప్రయత్నాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. ఇప్పటికే వివిధ పార్టీలతో చర్చలు ప్రారంభించామని, ఆగస్టు 10న పౌరసమాజ ప్రతినిధులు, న్యాయకోవిదులు, పాలనానుభవం కలిగినవారు, మీడియా ప్రముఖులతో జూబ్లీ హాల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

**పరిష్కారంలో భాగంగా నాలుగు ప్రధానాంశాల మీద లోక్‌సత్తా దృష్టి సారిస్తుందని తెలిపారు.** 1) తూర్పు తీర ప్రాంతంలో అతిపెద్ద నగరంగా ఉన్న హైదరాబాద్ తెలుగు ప్రజలందరిదీ, ఇక్కడ ఏ ప్రాంతం వారైనా భరోసాతో జీవించవచ్చు అనే విశ్వాసాన్ని కలిగించేందుకు రాజ్యాంగపరమైన ఏర్పాట్లు చేయటం.

2) హైదరాబాద్ నగర ప్రజల నుంచి వచ్చే పన్నులు – ప్రధానంగా వ్యాట్, స్టాంప్ డ్యూటీ, రాష్ట్ర ఎక్సయిజ్, మోటారు వాహనాల పన్నులలో సీమాంధ్రకు వాటా ఎలా? క్రమంగా ఆ వాటాను తగ్గిస్తూ హైదరాబాద్ ఆదాయాన్ని పూర్తిగా ఈ ప్రాంతానికే చెందేలా చేసే ప్రక్రియ ఎలా?

3) రాష్ట్ర విభజన వల్ల అందరికంటే ఆక్రోశం ఉండేది – తీరప్రాంతం, వర్షపాతం, మహానగరం, ఎక్కువ ఉపాధి అవకాశాలు లేని రాయలసీమలోనే. అందుకే రాయలసీమకు ప్రత్యేక ఏర్పాట్లు ఏమిటనేది తేల్చటం

4) ఈ విభజన ప్రక్రియ మొత్తం కేవలం ముఖ్యమంత్రి పదవికే అన్నట్టు ఇప్పుడు చర్చ జరుగుతున్న తీరును చూస్తే అనిపిస్తుంది. ఇది ప్రజలను దగా చేయటమే. ముఖ్యమంత్రి చుట్టూ కేంద్రీకృతమైన పాలనను మార్చి, అధికార, ఆర్థిక వికేంద్రీకరణ, అవినీతిని అంతం చేసేందుకు వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయటం ఎలా?

## మండలస్థాయి నుంచి లోక్‌సత్తా వారు కూడా పరిష్కారంలో భాగస్వాములు కావాలి

పై అంశాల ప్రాతిపదికన చర్చ చేస్తూ అన్ని ప్రాంతాలలోని లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు మండలం, మునిసిపాలిటీలలో ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న వారితో కూర్చుని పరిష్కారం దిశగా కృషి చేయాలని జేపీ పిలుపునిచ్చారు.

నోటికొచ్చినట్టు నేతలు మాట్లాడుతుండబట్టే ఈవేళ రాష్ట్రంలో విద్వేషాలు రగులుతున్నాయని, పరిష్కారాలు చెప్పటం కన్నా ఆ పరిష్కారానికి అందరినీ ఒప్పించే నాయకత్వాన్ని ప్రదర్శించటం ఇప్పుడు కీలకమని, ప్రతి అంశం మీద అందరితో సంప్రదించి విజేతలు, పరాజితులు అనే భావన లేకుండా అందరికీ ఆమోదయోగ్య పరిష్కారం సాధించటం కోసం లోక్‌సత్తా బాధ్యత తీసుకుంటుందని జేపీ అన్నారు. రాజకీయంగా నష్టపోయినా అందరికీ ఎలా మేలుచేద్దామన్న దూరదృష్టి పార్టీలకు కావాలని, చిత్తశుద్ధితో ఇలాంటి సమగ్ర, సామరస్య పరిష్కారానికి కలిసిరావాలని, ఈ దిశగా ప్రజాభిప్రాయాన్ని మలిచేందుకు క్షేత్రస్థాయిలో కూడా తమ వంతు ప్రయత్నాన్ని చేయాలని పౌరసమాజానికి, మీడియాకు, ఆలోచనాపరులకు జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. ■

# మంచి ఫలితాలిచ్చేలా విభజన ఉండాలి

రాష్ట్ర విభజన అనేది ప్రజలకుమంచి ఫలితాలనిచ్చేదిగా ఉండాలే తప్ప.. రాజకీయ అధికార పంపిణీ కోసమే అయితే చాలా ప్రమాదకరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారి అభిప్రాయాల సేకరణకు కాంగ్రెస్ కమిటీని కాకుండా.. తక్షణమే కేంద్ర ప్రభుత్వ కమిటీని వేయాలన్నారు. దీనిని కాంగ్రెస్ అంతర్గత వ్యవహారంలా కాకుండా జాతీయ వ్యవహారంగా పరిగణించాలన్నారు. 'ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం' ఆధ్వర్యంలో జూబ్లీహాల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పీఠం ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రకటన నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లోని తెలుగువారి ప్రయోజనాలను పరిరక్షించేలా, వారికి భరోసా కలిగించేలా చేపట్టాల్సిన చర్యలు అనే అంశంపై ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఎవరేమన్నారంటే...

**రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల అభిప్రాయాల వెల్లడి**

### కేవలం రాజకీయ అధికార పంపిణీ కోసం కారాదు

"విభజన జరిగితే అది అన్ని ప్రాంతాల్లోని ప్రజల అభివృద్ధికి బాటలు వేసేలా ఉండాలే తప్ప.. రాజకీయ అధికార పంపిణీకి, రాజకీయ నాయకులకు పదవులు, కొందరు అధికారులకు కావాల్సిన పోస్టులు వేయించు కునేందుకు మాత్రమే కాదు. అలా అధికారాన్ని పంచుకు నేందుకు రాజకీయ పార్టీ చేసే ప్రయత్నమే అయితే చాలా ప్రమాదకరం. దేశంలో ఎవరు ఎక్కడికైనా వెళ్లి ఉపాధి పొందవచ్చు. ఆస్తిని సంపాదించు కోవచ్చు, జీవించవచ్చని రాజ్యాంగంలో హక్కులు న్నాయి. వాటి అమలులో ప్రభుత్వాలు విఫలమవడంవల్లే ఇప్పుడీ సమస్యలకు కారణం. విభజనతో ఉత్పన్నమయ్యే సమస్యలకు పరిష్కారాలున్నాయి. ఇదేదో ఉపద్రవం సంభవించినట్లు కాదు, పునర్ నిర్మాణం, పునరాలోచనకు అదో అవకాశంగా భావిస్తే సమస్య తేలికవుతుంది" అని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.



### సామాన్యుల్లో భయం లేదు

"హైదరాబాద్‌లో సీమాంధ్రులకు భద్రతపై సామాన్యుల్లో భయాందోళన లేదు. ఉన్నదంతా ఉద్యోగుల్లోనే. రాష్ట్ర విభజన జరిగితే వారికి ఆప్షన్లు ఇవ్వాలి, తద్వారా భద్రత ఉండదన్న సమస్యకు పరిష్కారం కనుగొనవచ్చు. రాయలసీమ అత్యంత వెనుకబడిన ప్రాంతం, అది అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా ప్రత్యేక రాష్ట్రం చేయాలి. రాష్ట్ర విభజన అంశం కాంగ్రెస్ సొంత వ్యవహారం కాదు.. వారి పార్టీ కమిటీని కాదు, కేంద్ర మంత్రివర్గ ఉపసంఘాన్ని వేయాలి. ఆ సంఘం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలతో మాట్లాడాలి. తర్వాతే కొత్త రాజధాని గురించి నిర్ణయించాలి" అని సీనియర్ పాత్రికేయులు పొత్తూరి వెంకటేశ్వరరావు అభిప్రాయపడ్డారు.

- హెచ్ఎండీఏ పరిధిలోని హైదరాబాదను కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలని న్యాయవాది ప్రతాప్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

- కేంద్రపాలిత ప్రాంతం చేయడమనేది అప్రజాస్వామిక నిర్ణయమవుతుందని 1969 తెలంగాణ ఉద్యమకారుల సమాఖ్య నేత కొల్లూరి చిరంజీవి అభిప్రాయపడ్డారు.

### అప్పులు కూడా పంచుకోవాలి

"హైదరాబాద్ ఆదాయంలో వాటా కావాలంటే అప్పులు కూడా పంచుకోవాలన్న వాదన కూడా వస్తుంది కదా.. ఒక రాజధాని నగరాన్ని వ్యాపార, స్థిరాస్తి ధరలతో ముడిపెట్టి చూడడం సమంజసం కాదు. హైదరాబాద్‌లో ఇతర ప్రాంతాల వారికి భద్రత అనేది రాజ్యాంగంలో ఉండదు. అది రాజకీయ, పాలనా సమర్థతపై ఆధారపడి ఉంటుంది" అని నల్సార్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ పేర్కొన్నారు.

### సీడబ్ల్యూసీ తీర్మానంలోని అంశాల్లో స్పష్టత లేదు

"కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ చేసిన తీర్మానంలోని ఏడు అంశాల్లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అన్నది తప్ప మిగిలిన వాటిలో స్పష్టత లేదు. హైదరాబాద్ 10 ఏళ్లపాటు ఉమ్మడి రాజధాని అన్నారు. ఆ పది సంవత్సరాలు హైదరాబాద్ యాజమాన్యం ఏ రాష్ట్ర పరిధిలో ఉంటుంది?.. పదేళ్ల తర్వాత హైదరాబాద్ ఏమవుతుందో చెప్పలేదు. ఒక రాష్ట్రంలో ఇంకో రాష్ట్రం పెట్టడమనేది రాజ్యాంగంలో లేదు. అలా పెట్టాలంటే కచ్చితంగా ఆ ప్రాంతం కేంద్రపాలిత ప్రాంతంగా ఉండాలి" అని కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య అన్నారు.

### భద్రత సమస్యలు వచ్చే అవకాశం ఉంది

"అంతరంగిక భద్రత సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్ అనేది తెలంగాణ, సీమాంధ్ర అనే రెండు ప్రాంతాల వారికి చెందిన అంశమే కాదు. బయట పొరుగు దేశాలకు చెందిన కొన్ని శక్తులు కూడా దీన్ని పరిశీలిస్తుంటాయి. లష్కరే తోయిబా, బంగ్లాదేశ్‌కు చెందిన కొన్ని ఉగ్రవాద సంస్థలు హైదరాబాద్ లక్ష్యమని వారి డైరీలో రాసుకున్న సంఘటనలున్నాయి. హైదరాబాద్‌లోని సీమాంధ్రులను తెలంగాణ వారు బెదిరిస్తారనేది అతిగా చెప్పడమే. తెలంగాణ ఉద్యమం తీవ్రంగా ఉన్నప్పుడు కొందరు సీమాంధ్ర సంస్థల నుంచి డబ్బులు వసూలు చేసుకున్నారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. జూలై 30న ప్రకటన తర్వాత ఇక్కడి నాయకుల భాష కూడా మారింది" అని మాజీ డీజీపీ అరవిందరావు అన్నారు.

### హైదరాబాద్‌ను జాతీయ నగరంగా చేయాలి

"హైదరాబాద్‌ను జాతీయ నగరంగా చేయాలి. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల వారికీ ఈ నగరంపై సమాన హక్కుంది. 8.6 కోట్ల మందికి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను తెలంగాణకే రాజధానిని చేస్తే, 2.6 కోట్ల మందికే రాజధాని అయి దాని స్థాయి తగ్గించినట్లవుతుంది. గ్రేటర్ హైదరాబాద్‌కు అనుకుని ఉన్న రెండు మూడు నియోజక వర్గాలను కలిపితే అది మూడు రాష్ట్రాలకూ రాజధానిగా ఉండవచ్చని శ్రీ కృష్ణ కమిటీ కూడా చెప్పింది" అని ఆంధ్రా మేధావుల వేదిక చలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు.

### ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం తప్పనిసరి

"రాయలసీమ వెనుకబడిన ప్రాంతం. పరిశ్రమలు, నీటివనరులు ఏ మాత్రం లేవు. అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిందే" అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ''రాయలసీమలోని ప్రాజెక్టులకు నికరజలాలను కేటాయించాలి, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అభివృద్ధి చెందుతాం" అని రాయలసీమ వికాస కార్యదర్శి దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. "నీటి వనరుల విషయంలో ఎవరి అధిపత్యం ఉండరాదు, జాతీయ స్థాయిలో ఒక అథారిటీని ఏర్పాటు చేసి నీటిని కేటాయించాలి" అని అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర నదీజలాల యాజమాన్య సంస్థను ఏర్పాటు చేసి నీటిని కేటాయించాలని సామాజికవేత్త హనుమాన్ చౌదరి సూచించారు.

### శాస్త్రీయంగా ఉండాలి

"రాష్ట్రాన్ని ఎన్ని ముక్కలు చేస్తారనేది కాదు, అది శాస్త్రీయంగా ఉండాలి. హేతుబద్ధమైన ప్రజాహిత పరిష్కారం దిశగా ప్రయత్నించాలి. సమస్య ముదరకుండా, ఆత్మహత్యలు జరగకుండా నిరోధించేందుకు కృషి చేయాలి" అని స్వాతంత్ర్య సమరయోధుడు చెన్నమనేని రాజేశ్వరరావు పేర్కొన్నారు.

### పునర్విభజన చట్టంలో అన్ని సమస్యలనూ ప్రస్తావిస్తారు

" రాష్ట్ర పునర్విభజన చట్టం వచ్చినపుడు అందులో అన్ని సమస్యల గురించి ప్రస్తావిస్తారు. అయితే కనీసం బిల్లు పెట్టే సమయంలోనైనా విస్తృతమైన చర్చ జరపాల్సిన అవసరం ఉంది. రాజకీయాలు స్థిరంగా ఉండి, శాంతి, మౌలిక సదుపాయాలు ఉంటే హైదరాబాద్‌లో మున్ముందు కూడా పెట్టుబడులు వస్తాయి" అని మాజీ ఐఎఫ్ఎస్ అధికారి పద్మనాభరెడ్డి పేర్కొన్నారు.

### జిల్లాలు, గ్రామాల మధ్య కూడా జల వివాదాలు తప్పవు

"విభజన సమయంలో ముఖ్యమైనది. నీటి వనరుల సమస్య. వ్యవసాయంపై ఆధారపడి 70 శాతం మంది ఉన్నారు.

వారి పరిస్థితి ఏమిటనేది ఆలోచించాలి. జల వనరుల సమస్య పరిష్కరించకపోతే రేపు రెండు రాష్ట్రాల మధ్యే కాదు, జిల్లాలు, గ్రామాల మధ్య కూడా జలవివాదాలు తప్పవు. సీమాంధ్ర వారికి రక్షణ కల్పిస్తామంటూ దిగ్విజయ్‌సింగ్ మాట్లాడుతున్నారు. కొత్తగా రక్షణ కల్పించేదేమిటి?... రాజ్యాంగంలోనే హక్కులున్నాయి. వాటిని అమలు చేస్తే చాలు. విభజన అనేది ఒక రాజకీయ పార్టీతో కాదు ప్రభుత్వ పరంగా చేస్తేనే అది రాజ్యాంగ ప్రక్రియకు నాంది అవుతుంది. ఇప్పుడు చేసిన ప్రకటన పార్టీ పరంగానే వచ్చింది" అని మాజీ న్యాయమూర్తి అంబటి లక్ష్మణరావు పేర్కొన్నారు.

### హైదరాబాద్‌ను వదిలేసి మూడు కొత్త రాజధానులు కట్టుకోవాలి

"హైదరాబాద్ ఇప్పటికే అభివృద్ధి చెందిన నగరం. దాని మానాన దాన్ని వదిలేయాలి. అది తెలంగాణలోనే ఉంటుంది. కానీ, తెలంగాణకు మరో రాజధానిని నిర్మించుకుంటే బాగుంటుంది. రాయలసీమను కచ్చితంగా ప్రత్యేక రాష్ట్రం చేయాలి. అంతేగాని రాయల తెలంగాణ అంటూ రాయలసీమ అస్తిత్వాన్ని దెబ్బతీయడం సరైంది కాదు. హైదరాబాద్ కాకుండా మూడు రాష్ట్రాల్లో మూడు కొత్త రాజధానులను కట్టుకోవచ్చు" అని హెచ్ఎంటీవీ చీఫ్ ఎడిటర్ రామచంద్రమూర్తి పేర్కొన్నారు.

### చిన్న రాష్ట్రాలపై కాంగ్రెస్, భాజపా వైఖరేంటో తేల్చాలి

**- ప్రొఫెసర్ కంచ ఐలయ్య**

చిన్న రాష్ట్రాల విషయంలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భాజపీలకు ఉన్న సిద్ధాంతాలేంటో స్పష్టం చేస్తే అన్ని సమస్యలూ తేలిపోతాయి. ఆ పార్టీలను ఈ విషయమై మనమెందుకు ప్రశ్నించం. నరేంద్రమోడీ రేపు గుజరాత్‌ను రెండు రాష్ట్రాలుగా చేస్తారా? నిన్నటివరకు మాట్లాడని కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి ఇప్పుడు హిందీ మాట్లాడేవారికి 8 రాష్ట్రాలున్నపుడు తెలుగువారికి రెండు రాష్ట్రాలుండవద్దా అంటున్నారు. ఒక్కరోజులోనే విధానాన్ని ఎలా మార్చుకున్నారో మరి. భాజపా, సీపీఐ తెలంగాణ ఐకాసలో ఉన్నాయి. మరి సీమాంధ్రలో ఎక్కడున్నాయో తెలీదు. సీపీఐ పత్రిక పేరేమో విశాలాంధ్ర వారి విధానం మాత్రం విభజన. సీపీఎం సమైక్యం అంటుంది కానీ.. అటు తెలంగాణలో కానీ, సీమాంధ్రలో కానీ దాని కోసం ఉద్యమం చేయదు. తెలంగాణ రాష్ట్రాన్ని వెంటనే ఏర్పాటు చేసేయాలని నేను అనలేను. అది సాధ్యం కాదు. హైదరాబాద్‌లో ఆదాయంపై వాటా అన్న గొడవ ఆంధ్ర పెట్టుబడిదారులు, తెలంగాణలోని భూస్వాముల మధ్యనే తప్ప మిగిలినవారికి లేదు. ఇరుప్రాంతాల్లోనూ ప్రొఫెసర్లు, ఉద్యోగులను ఉద్యమంలోకి దించారు ఇది ప్రమాదకరం. తెలంగాణలో మంత్రులు ఉద్యమం నడిపించారు. సీమాంధ్రలో ముఖ్యమంత్రి కూడా ఉద్యమం నడిపిస్తున్నారు.. ఇలాంటివి ఆపాలి.

### ప్రాధాన్యం ప్రకారం జలవనరుల కేటాయింపు

**- ఎమ్మెల్సీ కె. నాగేశ్వర్**

రాష్ట్రంలో గోదావరి ప్రారంభమయ్యే ఆదిలాబాద్‌లో ఆ నదిపేరు ఉపయోగించుకునే పరిస్థితి లేదు. కృష్ణానది పారే మహబూబ్‌నగర్‌లోనూ అదే పరిస్థితి. రూ. 2 వేల కోట్లు పెడితే ఆదిలాబాద్ మరో కృష్ణాజిల్లాగా మారే అవకాశం ఉంది. కానీ, ఎవరూ పట్టించుకోరు. పరీవాహక ప్రాంత రైతులకు, కనీసం ఒక పంటకు నీరిచ్చేలా, కరవు పీడిత ప్రాంతాలకు ప్రాధాన్యం వంటి వాటి ప్రాతిపదికన జలవనరులను కేటాయిస్తే సమస్య పరిష్కారమవుతుంది. కేంద్ర మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయాలి, మంత్రివర్గం ఒక నోట్‌తో రావాలి. ■

### సమావేశం చేసిన తీర్మానాలు

- రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో హింసకు తావులేకుండా, ప్రజలకు ఆటంకం కలిగించకుండా, శాంతియుతంగా ఉద్యమం చేయాలి. ఎవరి చేతుల్లోనో ప్రజలు పావులు కారాదు.
- విద్యార్థులకు విద్యా సంవత్సరం వృథా కాకుండా, జన జీవనానికి ఆటంకం కలుగకుండా చూడాలి. ప్రభుత్వ నిర్వహణ బాధ్యత ఉన్న ఉద్యోగులు ప్రజలకు సేవలందించడంలో ఇబ్బందులు తలెత్తకుండా విధులను నిర్వర్తించాలి. దీంతోపాటు వారి హక్కులు, భద్రత గురించి లేవనెత్తాలి.
- ప్రాంతీయ సమస్యలే కారణంగా నిర్ణయాలు జరిగిపోతే తెలంగాణే కాదు, ఇతర ప్రాంతాల్లోనూ సమస్యలున్నాయి. వాటన్నింటికీ దీర్ఘకాలిక పరిష్కారం అవసరం.
- రాష్ట్ర విభజనపై రాజకీయ వర్గానికే కాదు, పౌర సమాజానికి పాత్ర ఉండాలి. అందరి అభిప్రాయాలను సేకరించాలి. ■

# రాయలసీమ, కోస్తాంధ్రకు భరోసానిచ్చేందుకు లోక్‌సత్తా రౌండ్‌టేబుల్ సమావేశం, ప్రచార కార్యక్రమం

రాష్ట్ర విభజనపై ఇంత జరిగాక వెనక్కిపోవటం బహుశా సాధ్యం కాదని, రోజుకోసారి అటూఇటూ గెంతితే ప్రభుత్వానికి అర్థం ఉండదని, అందువల్ల తీవ్ర ఆందోళనలో ఉన్న రాయలసీమ, కోసాంధ్ర ప్రజలలో భరోసాను నింపేలా, వారికి సరైన మార్గం చూపేలా, అన్ని ప్రాంతాల, అన్ని వర్గాల ప్రయోజనాల్ని పరిరక్షించేలా తెలుగువారి ఐక్యతను, అభివృద్ధిని ఆకాంక్షించేవారందరితో కలిసి విస్తృత ప్రచార కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు.

ప్రత్యేక తెలంగాణ, సమైక్యాంధ్రప్రదేశ్ డిమాండ్లను ఏకకాలంలో నెరవేర్చటం సాధ్యంకాదని, ఈ సమస్యకి నిర్మాణాత్మక పరిష్కారం, విభజన తర్వాత ఎటువంటి ఏర్పాట్లు ఉండాలన్న అంశంపై ప్రచారంలో భాగంగా తొలుత ఆగస్టు 10న సీమ, కోసాంధ్ర విద్యార్థి, సంఘాలు, ప్రభుత్వోద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, తెలుగువారి హితం కోరేవారితో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

యూపీయే, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రకటించిన నేపథ్యంలో తెలుగుగడ్డ మీద జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో శుక్రవారం ఇక్కడ లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాయంలో మీడియాతో జేపీ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఈ పరిస్థితికి ప్రధానంగా కేంద్రప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ చేసిన పెద్దతప్పులే కారణమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం మొదలయ్యాక సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కనీస సంప్రదింపుల బాధ్యతను కేంద్రం నెరవేర్చలేదన్నారు. మీరు చెప్పేది చెప్పండి, మేం చేయాల్సింది రహస్యంగా చేస్తామన్నట్టు కేంద్రం వ్యవహరించిందన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజల బాధ ఏమిటి, సీమ, కోస్తా ప్రజల బాధ ఏమిటి అని తెలుసుకునేందుకు నిజాయతీగా ప్రయత్నమే చేయలేదన్నారు. నాలుగుసార్లు సంప్రదింపులు జరిపామని పీసీసీ అధ్యక్షుడు చెబుతున్నారని, మొక్కుబడిగా నాలుగు మాటల్ని అభిప్రాయాలుగా తీసుకోవటం తప్ప అసలు కేంద్రం చర్చల్ని, సంప్రదింపుల్ని ఎక్కడ చేసిందని జేపీ సూటిగా ప్రశ్నించారు. నిర్ణయం ఏదైనా కావచ్చని, కాని అది ఏ ప్రాతిపదికన తీసుకోవటం అన్నదాని మీద ఎక్కడైనా చర్చ జరిగిందా అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ కావాలని రాష్ట్రంలో ముసలం పెట్టి పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు.

ఒక రాష్ట్రంపై నిర్ణయం జరిగేటప్పుడు ఆ రాష్ట్ర అసెంబ్లీలో చర్చ జరగాలని, గదిలో పెద్దఏనుగు ఉంది, లేనట్టు నటించొద్దు, శాసనసభలో తెలంగాణ అంశంపై సమగ్ర చర్చ చేసి ఒక పరిష్కారాన్ని మనమే రూపొందించుకుందాం అని లోక్‌సత్తా పలుమార్లు డిమాండ్ చేసినా అన్ని పార్టీలూ పెడచెవిన పెట్టాయని జేపీ ధ్వజమెత్తారు. "ఒక రాష్ట్ర భవిష్యత్తు ఆ రాష్ట్రంలోనే తేలాలి. తేలని పరిస్థితులలో కేంద్రం పెద్దరికంతో వ్యవహరించి అందరినీ కూర్చోబెట్టి రాజీ చేయాలి. ఏదోకమేర అన్నిపక్షాలలో అసంతృప్తి ఉన్నప్పటికీ రాజీ ద్వారా పరిష్కారం వస్తుంది. రాజీలో విజేతలు, పరాజితులు ఉండరు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ పని చేయకుండా తాంబూలాలిచ్చాం తన్నుకుచావండన్నట్టు, ఒక చక్రవర్తిలా హుకుం జారీచేసి మాకు నచ్చింది చేస్తాం మీరు ఒప్పుకుని తీరాలన్నట్టు వ్యవహరించి రాష్ట్రంలో చిచ్చుపెట్టింది" అన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ నేతలు వారిస్తున్నా వినకుండా తెలుగుదేశం పార్టీని గద్దె దింపటానికి 1999లో వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌ను లేవనెత్తారని, కాసిని ఓట్లు ఎక్కువొస్తే గెలుస్తామని పొత్తు పెట్టుకున్నారని, అదేవిధంగా తెలుగుదేశం అధికారం కోసం నిజానిజాలతో సంబంధం లేకుండా తెలంగాణ అంశాన్ని భుజాన వేసుకుని పొత్తుపెట్టుకుందని, రెండు ప్రధాన పార్టీలు ఆ వాదన వినిపించేసరికి ప్రజలు అదే వాస్తవమని అనుకున్నారని జేపీ అన్నారు. తెలంగాణపై కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా సహకరిస్తామని చెప్పిన వైకాపా నిస్సిగ్గుగా రాజీనామాలకు పాల్పడిందన్నారు. ఏ ఎండకాగొడుగు పట్టటం తప్ప సిద్ధాంత ప్రాతిపదిక, తెలుగు ప్రజల ప్రయోజనాల పట్ల కనీస ఆలోచన లేని ఆ పార్టీల వంచనలో, ఉద్యమాల ఉచ్చులో పడవద్దని జేపీ యువతకు విజ్ఞప్తి చేశారు. పార్టీల నేతల విగ్రహాలను ధ్వంసం

చేస్తూ కార్యాలయాలపై దాడులు చేస్తున్నారని, ప్రజలు పార్టీల మీద కాకుండా తమ భావాలను ప్రజాస్వామికంగా వ్యక్తం చేయటంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. జాతీయ నాయకులైన నెహ్రూ వంటి వారి విగ్రహాలపై దాడులు చేయటం మనల్ని కించపరుచుకోవటమేనని, ఇందిరాగాంధీ భావాలతో లోక్‌సత్తా తీవ్రంగా విభేదించినా దేశ ఐక్యత కోసం కృషి చేసిన ఒక నేతగా ఆమెను ఎప్పుడూ గౌరవిస్తుందని అన్నారు. పార్టీల మోసానికి ఓటు ద్వారానే బుద్ధిచెప్పాలన్నారు. నిరసనకు హింసాత్మక ఆందోళనలు, ఆత్మహత్యలు, దహనకాండలు మార్గంకావని, ఆర్థికవ్యవస్థను స్తంభింపచేసే బంద్‌లు, రాస్తారోకోలకు పాల్పడటమంటే మన వేళ్లతో మన కళ్లను పొడుచుకోవటమేనని అన్నారు.

ఎన్జీవోలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చుని, శాంతియుతంగా నిరసన సమావేశాలు పెట్టుకోవచ్చుని, కానీ విధుల్ని బహిష్కరించటం ఎంతమాత్రం తగదని జేపీ నిర్ద్వంద్వంగా పేర్కొన్నారు. ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వోద్యోగులు ఇలా చేయటం వల్ల కనీస సౌకర్యాలు కూడా ప్రజలకు స్తంభించిపోతాయని, ఆనాడు తెలంగాణలో చేసినా, ఈవేళ సీమ, కోస్తాంధ్రలో చేసినా ఎన్జీవోల విధుల బహిష్కరణ ఆమోదయోగ్యం కాదన్నారు.

రాష్ట్రం విడిపోతే రాజకీయ పటంలో గీత ఉంటుందితప్ప భూమ్మీద, ప్రజల మనసుల్లో ఏ గీతా ఉండదని దీన్నో ఉపద్రవంగా అనుకుంటూ ఆందోళన చెందాల్సిన పన్లేదని జేపీ అన్నారు. హైదరాబాద్‌లోని విద్యాసంస్థలలో, ఉద్యోగావకాశాలలో ఇప్పటికే ఉన్న స్థానిక రిజర్వేషన్లే కొనసాగుతాయని, మిగిలిన అంశాలలో తెలుగువారందరికీ, మిగిలిన రాష్ట్రాల వారందరికీ కూడా సమానావకాశాలు, సంపూర్ణ స్వేచ్ఛతో జీవించే హక్కు ఉంటుందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కుల పరిరక్షణకు కేంద్రం తగిన ఏర్పాట్లు చేసి ప్రజలలో భరోసా నింపాలన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడటమంటే మరో దేశం ఏర్పడుతున్నట్టు సీమ, కోసాంధ్రలో గ్రామస్థాయి నుంచి ప్రజలు అభద్రతకు గురవుతున్నారని, తమ పిల్లలకు అవకాశాలు దూరమవుతాయేమోనని భయపడుతున్నారని, అన్నిటినీ హైదరాబాద్‌లో కేంద్రీకరించటం వల్లే ఈ సమస్య వచ్చిందని జేపీ అన్నారు. హైదరాబాద్‌లాంటి మరో నగరాన్ని సీమ, కోస్తాంధ్రలో తయారుచేయవద్దని, అన్నీ రాజధానిలో ఉండే విధంగా కాకుండా ఆర్థికాభివృద్ధి కేంద్రాలుగా ఉండేందుకు పలు నగరాలను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలని జేపీ అన్నారు. తెలంగాణ, కొత్తగా ఏర్పడే రాష్ట్రంలో సుమారు 15-20 పెద్ద నగరాలను, కొన్ని చోట్ల రెండుజిల్లాలకో పెద్దనగరాన్ని తయారుచేయాలన్నారు. తీరప్రాంతంలేకుండా, వర్షపాతం తక్కువగా ఉన్న రాయలసీమలో యువతకు ఉపాధిని కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఇలాంటి నిర్దిష్ట ఏర్పాట్లపై చర్చించి ప్రజలలో, ముఖ్యంగా యువతలో భరోసా నింపేందుకే లోక్‌సత్తా ప్రచార కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. ■

**జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పూర్తి కావడానికి ప్రాంతాలవారీగా అవసరమైన నిధుల వివరాలివి..**

| ప్రాంతం | అనుమతి ఇచ్చిన మొత్తం | 2013 మార్చి వరకు వ్యయం | అవసరమైన మొత్తం (రూ. కోట్లలో) |
|---|---|---|---|
| తెలంగాణ | 99,871 | 34,253.71 | 67,433.88 |
| ఆంధ్రా | 44,600.37 | 19,098.39 | 26,205.37 |
| రాయలసీమ | 24,688.28 | 18,002.71 | 7,137.64 |
| **మొత్తం** | **1,69,159.96** | **71,354** | **1,00,776** |

**జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ఎత్తిపోతల పథకాల కింద ఉన్న ఆయకట్లు, విద్యుత్తు అవసరాలు ఇలా ఉన్నాయి**

| ప్రాంతం | ఎత్తిపోతల పథకాలు | ఆయకట్టు(కొత్తది) | స్థిరీకరణ(ఎకరాల్లో) | విద్యుత్తు (మెగావాట్లలో) |
|---|---|---|---|---|
| తెలంగాణ | 16 | 40,84,750 | 1,34,584 | 7,367.43 |
| ఆంధ్రా | 7 | 14,44,967 | 29,119 | 525.92 |
| రాయలసీమ | 8 | 7,30,686 | 77,424 | 853.01 |

# రాష్ట్రంలో జలవనరులు - కేటాయింపులు

ఆంధ్రప్రదేశ్ విభజనకు కేంద్రం నిర్ణయం తీసుకొన్న నేపథ్యంలో జల వివాదాలు తలెత్తుతాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. కృష్ణానది పరిధిలో ఉన్న ప్రాజెక్టులపై రాష్ట్ర విభజన ప్రభావం ఎలా ఉంటుంది? దిగువన ఉండే కృష్ణా డెల్టాకు ఏమైనా సమస్య ఉంటుందా? సాగర్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీళ్లు అందుతాయా? మహబూబ్‌నగర్, నల్గొండ, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో మిగులు జలాల ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టులకు నీళ్లు అందుతాయా వంటి అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాస్తవ పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని సామరస్యంగా నిర్ణయాలు తీసుకోకపోతే సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో కృష్ణా పరివాహకానికి సంబంధించిన వివరాలు..

***కృష్ణానదిలో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న కేటాయింపు ఎంత?***

బచావత్ ట్రైబ్యునల్ తీర్పు ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు లభించిన వాటా 800 టీఎంసీలు. ఈ తీర్పు 1976లో వచ్చింది. కృష్ణానది ప్రవహిస్తున్న కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ మధ్య ఆ నదీ జలాలను పంపిణీ చేయడానికి ఈ ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేశారు.

***ఏ ప్రాజెక్టులకు ఎంత కేటాయింపులు?***

కృష్ణాడెల్టాకు 181.20 టీఎంసీలు, నాగార్జునసాగర్ (281), కేసీ కాలువ (39.9), తుంగభద్ర హెచ్చెల్సీ, ఎల్లెల్సీ (62), జూరాల (17.84), ఆర్డీఎస్‌కు 15.9 టీఎంసీలు కేటాయించారు (మొత్తం కేటాయింపులు పట్టిక రూపంలో). తర్వాత కృష్ణాడెల్టా ఆధునికీకరణ ద్వారా నీటిని ఆదా చేయవచ్చని లెక్కగట్టి 20 టీఎంసీల నీటిని మహబూబ్‌నగర్ జిల్లాలోని భీమా ఎత్తిపోతలకు ప్రభుత్వం కేటాయించింది. పులిచింతలకు తొమ్మిది టీఎంసీలు కేటాయించింది. ప్రస్తుతం కృష్ణాడెల్టా నీటి కేటాయింపు 152.50 టీఎంసీలు. రాష్ట్రానికి ఉన్న నీటి కేటాయింపుల నుంచే చెన్నై తాగునీటి అవసరాలకు ఆంధ్రప్రదేశ్ వాటాగా ఐదు టీఎంసీలను కేటాయించారు.

***బచావత్ ట్రైబ్యునల్ ఏ ప్రాతిపదికన ఈ కేటాయింపులు చేసింది?***

తీర్పు నాటికి సాగులో ఉన్న ఆయకట్టును రక్షించడానికి ట్రైబ్యునల్ ప్రథమ ప్రాధాన్యం ఇచ్చింది. మూడు రాష్ట్రాలు వేటి అవసరాలు అవి చెప్పాయి. ఆంధ్రప్రదేశ్ 2,000 టీఎంసీలకు పైగా తమకు అవసరం ఉందని పేర్కొంది. 1885 నుంచి ఆయకట్టు సాగులో ఉన్న కృష్ణాడెల్టా, 1866 నుంచి



వినియోగంలో ఉన్న కేసీ కాలువ, 1953 నుంచి ఉన్న తుంగభద్ర ఎల్లెల్సీ, 1967 నుంచి ఉన్న తుంగభద్ర హెచ్చెల్సీ, 1967లో నిర్మితమైన నాగార్జునసాగర్ ఆయకట్టు అవసరాలను ట్రైబ్యునల్ పరిగణనలోకి తీసుకొంది.

***బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపుల అమలు జరిగాయా?***

పూర్తిస్థాయిలో అమలు జరగలేదు. కొన్ని ప్రాజెక్టుల్లో కేటాయించిన నీటికంటే ఎక్కువ వినియోగించుకుంటే, కొన్నింటికి కేటాయింపుల మేరకు రాలేదు. కృష్ణాడెల్టా, నాగార్జునసాగర్, కేసీ కాలువలాంటి ప్రధాన ప్రాజెక్టుల కింద కేటాయింపుల కంటే ఎక్కువ నీటిని వినియోగించుకొన్నారు. రాజోలిబండ నీటి మళ్లింపు పథకం (ఆర్డీఎస్), భైరవాని తిప్ప, మూసీ, హెచ్చెల్సీ, ఎల్లెల్సీ ఇలా పలు ప్రాజెక్టుల కింద కేటాయింపుల మేరకు నీటి వినియోగం జరగలేదు.

***మిగులు జలాలు అంటే ఏమిటి? వాటి కింద ఏయే ప్రాజెక్టులు చేపట్టారు?***

మూడు రాష్ట్రాల్లోనూ 2,060 టీఎంసీలను వినియోగించడం ద్వారా మరో 70 టీఎంసీలు పునరుత్పత్తవుతాయని లెక్కగట్టి మొత్తం 2,130 టీఎంసీలను ట్రైబ్యునల్ పంపిణీ చేసింది. 2,130 టీఎంసీలను మించి వచ్చే నీటిని మిగులు జలాలుగా లెక్క గట్టారు. దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని సంవత్సరాల్లో.. కేటాయించిన నీరు కూడా లభ్యమయ్యే అవకాశం లేదు కాబట్టి, మిగులు జలాలను వినియోగించుకొనే స్వేచ్ఛను బచావత్ ట్రైబ్యునల్ ఆ రాష్ట్రానికి కేటాయించింది. ఈ స్వేచ్ఛను వినియోగించుకొని వెనుకబడిన ప్రాంతాల్లో సాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టింది. మిగులు జలాల ఆధారంగా తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలిగొండ, కల్వకుర్తి, నెట్టెంపాడు, ఎస్.ఎల్.బి.సి. ప్రాజెక్టులను ప్రభుత్వం చేపట్టింది. వీటికి 227.5 టీఎంసీలు అవసరం.

***పునరుత్పత్తి అవడమంటే?***

కాలువలకు నీరు వదిలిన తర్వాత సాగు అవసరాలూ పోనూ ఎంతో కొంత నీరు తిరిగి ప్రధాన ప్రవాహంలో కలిసే అవకాశం ఉంటుంది. వీటినే పునరుత్పత్తి అయిన జలాలుగా లెక్కిస్తారు.

***కృష్ణా పరివాహకంలో మిగులు జలాల లెక్క ఎంత?***

ప్రకాశం బ్యారేజి నుంచి సముద్రంలోకి వెళ్లే నీటిని మిగులు నీటిగా లెక్కిస్తారు. సరాసరిన ఇది 500 టీఎంసీల వరకు ఉంటుంది. కొన్ని సంవత్సరాల్లో వెయ్యి టీఎంసీలు కూడా వచ్చింది. ఎగువ రాష్ట్రాల వినియోగం పెరిగే కొద్దీ మిగులు జలాలు తగ్గిపోతున్నాయి. గత ఏడాది కేవలం 55 టీఎంసీలు మాత్రమే.

***బచావత్ ట్రైబ్యునల్ తీర్పు గడువు 2000తో ముగిసింది కదా? ఆ తర్వాత పంపిణీ సంగతేమిటి?***

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల వినతి మేరకు కేంద్ర ప్రభుత్వం 2004లో బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. బచావత్ ట్రైబ్యునల్ తీర్పు 2000, మేతో ముగిసినా.. ఆ తర్వాత కూడా ఆ ట్రైబ్యునల్ కేటాయింపుల్లో ఎలాంటి మార్పులు చేయరాదు. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ మొత్తం నీటి లభ్యత సరాసరిన 2,578 టీఎంసీలు ఉన్నట్లు తేల్చింది. బచావత్ ట్రైబ్యునల్ చేసిన కేటాయింపుల కంటే 448 టీఎంసీలు అదనంగా మూడు రాష్ట్రాలకు పంపిణీ చేసింది. ఇందులో 258 టీఎంసీలు మహారాష్ట్ర, కర్ణాటకలకు, 190 టీఎంసీలు రాష్ట్రానికి కేటాయించింది. ఈ తీర్పు 2010లో వెలువడింది. దీనిపై రాష్ట్రాలు ప్రస్తుతం అభ్యంతరాలను వినిపిస్తున్నాయి. త్వరలోనే గెజిట్‌లో ప్రచురించడానికి తుది తీర్పును ట్రైబ్యునల్ కేంద్రానికి అందజేస్తుంది. గెజిట్‌లో ప్రచురించినప్పటి నుంచి తీర్పు అమల్లోకి వస్తుంది.

***బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు వల్ల మిగులు జలాలు ఉంటాయా?***

2,578 టీఎంసీలకు మించి వస్తేనే మిగులు జలాలు. ఈ తీర్పు అమల్లోకి వస్తే మిగులు జలాలు లభ్యం కావడం కష్టమే.

***మిగులు జలాల ఆధారంగా మరి కొన్ని కొత్త ప్రాజెక్టులు కట్టే అవకాశం ఉందా?***

నీటి లభ్యత, ఇప్పటికే మిగులు జలాల ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకొంటే కృష్ణా పరివాహకంలో కొత్త ప్రాజెక్టులకు అవకాశం లేదు. జూరాల పైభాగం నుంచి పాలమూరు ఎత్తిపోతల, ఎస్.ఎల్.బి.సి.కి కొనసాగింపుగా దిండి పథకాలు ప్రతిపాదనలో ఉన్నాయి. పాలమూరు ఎత్తిపోతలకు సర్వే చేయించాలని కూడా ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. అనంతపురం జిల్లాకు మరో 40 టీఎంసీల నీటిని సరఫరా చేసే పథకానికి సర్వే చేయాలని నాలుగేళ్ల క్రితం

ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తర్వాత ఇది పెండింగ్‌లో పడింది.

***రాజకీయ నిర్ణయం తీసుకొని కదితే పరిస్థితి ఏంటి?***

కొత్త ప్రభుత్వాలు రాజకీయంగా నిర్ణయం తీసుకొని ప్రాజెక్టులు చేపట్టే అవకాశం ఉంది. గతంలో చేపట్టినప్పుడు ఆంధ్రప్రదేశ్ దిగువ రాష్ట్రం. ఇక్కడ వినియోగించుకోకపోతే మిగులు జలాలన్నీ సముద్రానికి వెళ్లాల్సిందే కదా.. రెండు, మూడేళ్లకు ఒకసారి మిగులు జలాలు వచ్చినా వెనుకబడిన ప్రాంతాలకు ఉపయోగపడుతుందని చేపట్టింది. ఈ ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నందున ఆంధ్రప్రదేశ్ నికర నీటి కేటాయింపులు కోరే అవకాశం ఉందని కర్ణాటక, మహారాష్ట్రలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. పనులు నిలిపివేసేలా ట్రిబ్యునల్ ఆదేశించే పరిస్థితి రావడంతో ఈ ప్రాజెక్టులకు నీటి కేటాయింపు కోరబోమంటూ ప్రభుత్వం రాతపూర్వకంగా హామీ ఇవ్వాల్సి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ విభజన వల్ల సీమాంధ్ర ప్రాంతానికి ఈ ప్రాజెక్టులన్నీ పై భాగంలో ఉన్నట్లే. వీటికి కేటాయింపుల విషయంలో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. రెండు రాష్ట్రాలూ ముందుగానే ఓ అవగాహనకు రావాల్సి ఉంది.

***విభజనతో ఎటువంటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది?***

ముఖ్యంగా శ్రీశైలం నుంచి నీటిని వినియోగించుకొనే విషయంలో సమస్య రావచ్చు. మిగులు జలాల ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టులన్నీ శ్రీశైలం కేంద్రంగానే ఉన్నాయి. శ్రీశైలం కనీస నీటిమట్టం 834 అడుగులుగా (నిర్మాణం చేపట్టినపుడు 854 అడుగులు) నిర్ణయించి నిర్వహణ కోసం 1996లో ప్రభుత్వం ఓ ఉత్తర్వు జారీ చేసింది. ఇందులో ప్రాధాన్యాలు నిర్ణయించింది. అయితే కనీస నీటిమట్టం ఎప్పుడూ నిర్వహించడం లేదు. గత ఏడాది హైకోర్టు ఆదేశాల మేరకు కనీస నీటిమట్టం నిర్వహించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 806 అడుగుల నుంచి నీటిని తీసుకోవచ్చు. అంటే కనీస నీటిమట్టానికన్నా చాలా తక్కువ. అలాగే హంద్రీనీవా 840 అడుగుల నుంచి తీసుకోవచ్చు. ప్రాధాన్యతలు, నిర్వహణ విషయంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

***రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు లేకుండా ఇతరత్రా మార్గాలు లేవా?***

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్.. తన తీర్పు అమలుకు కేంద్రం ఆధ్వర్యంలో ఓ బోర్డును ప్రతిపాదించింది. రాష్ట్రంలో కృష్ణా పరివాహకంలో నీటి నిర్వహణకు కూడా ఓ బోర్డును ఏర్పాటుచేసి అమలు జరిగేలా చూడొచ్చు. అయితే.. రెండు రాష్ట్రాల నుంచి బోర్డు మీద రాజకీయ ఒత్తిళ్లు ఉండొచ్చు.

***తెలంగాణలో నది ఎక్కువగా ప్రవహిస్తుంది. కాబట్టి నీటి వాటాలో మార్పులేమైనా ఉంటాయా?***

నది ఎక్కడ ఎక్కువ ప్రవహిస్తే అక్కడే ఎక్కువ కేటాయింపులు ఉండాలన్న ప్రాతిపదికన పంపకాలు జరగవు. అదే ప్రాతిపదికగా తీసుకుని ఉంటే ఆంధ్రప్రదేశ్‌కు 800 టీఎంసీలు దక్కేది కాదు. ఎందుకంటే కృష్ణాపరివాహకంలో ఎక్కువ ప్రాంతం కర్ణాటక, మహారాష్ట్రలోనే ఉంది. అలా అని ఆ రాష్ట్రాలకు ఎక్కువ నీటిని కేటాయించలేదు. కృష్ణాపరివాహకంలో మొత్తం 2,060 టీఎంసీల నీరు లభ్యమవుతుందని ట్రిబ్యునల్ లెక్కగట్టింది. అందులో ఆంధ్రప్రదేశ్ పరిధిలో లభ్యమయ్యే నీరు 300 టీఎంసీలు మాత్రమే. అయినా ఆంధ్రప్రదేశ్‌లో అప్పటికే ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయ్యి చాలా కాలంగా ఆయకట్టు సాగులో ఉండడంతో ఆ ఆయకట్టు సుస్థిర రక్షణకే ప్రాధాన్యమిచ్చి 800 టీఎంసీలు కేటాయించింది. అంటే.. మిగిలిన 500 టీఎంసీలు ఎగువ నుంచి రావాల్సిందే.

***దిగువన ఉన్న రాష్ట్రంగా (లోయర్ రైపేరియన్ స్టేట్) మిగులు జలాలను వినియోగించుకొనే అవకాశం ఆంధ్రప్రదేశ్‌కు ఉంది. రెండు రాష్ట్రాలుగా విభజించడం వల్ల సీమాంధ్ర లోయర్ రైపేరియన్ రాష్ట్రం అవుతుంది. దీని వల్ల ఎదురయ్యే సమస్యలు ఏంటి?***

దిగువన ఉన్న రాష్ట్రానికి ఉండే అనుకూలతను పరిగణనలోకి తీసుకొని మిగులు జలాలను వినియోగించుకొనే స్వేచ్ఛను బచావత్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్‌కు కల్పించింది. రాష్ట్ర విభజన జరిగితే సీమాంధ్ర లోయర్ రైపేరియన్ రాష్ట్రం అవుతుంది. లోయర్ రైపేరియన్ రాష్ట్రంలో దిగువన ఉన్న కృష్ణాడెల్టాకు నికర జలాల కేటాయింపు ఉంది. మిగులు జలాల ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టులు పైభాగంలో ఉన్న శ్రీశైలం నుంచి నీటిని తీసుకొనేలా ఉన్నాయి. కల్వకుర్తి, నెట్టెంపాడు, ఎస్ఎల్‌బీసీ తెలంగాణలోనూ, హంద్రీనీవా, గాలేరు-నగరి, వెలిగొండ సీమాంధ్రలోనూ ఉంటాయి. ఈ నేపథ్యంలో మిగులు జలాల వినియోగానికి

సంబంధించిన లోయర్ రైపేరియన్ రైట్స్ విషయంలో వివాదం నెలకొనే అవకాశం ఉంది.

***పోలవరం నిర్మాణం వల్ల ఎంత నీటిని కృష్ణా పరివాహకానికి మళ్లించవచ్చు? ఈ మళ్లింపు వల్ల సమస్య పరిష్కారమవుతుందా?***

పోలవరం నిర్మాణం ద్వారా 80 టీఎంసీల నీటిని కృష్ణా పరివాహకానికి మళ్లిస్తారు. ఇందులో 24 టీఎంసీలు కర్ణాటకకు, 14 టీఎంసీలు మహారాష్ట్రకు వెళ్తాయి. పోలవరం నిర్మాణం ప్రారంభించినప్పటి నుంచి ఈ నీటిని ఎగువ రాష్ట్రాలు వినియోగించుకొంటాయి. ఆంధ్రప్రదేశ్‌కు 45 టీఎంసీలు మిగులుతాయి. ప్రస్తుతం కృష్ణా పరివాహకంలో మిగులు జలాల ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టులకు 227.50 టీఎంసీలు అవసరం. కేవలం పోలవరం నిర్మాణం ద్వారా వెనుకబడిన మహబూబ్ నగర్, నల్గొండ, అనంతపురం, కడప, కర్నూలు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో ఆయకట్టు కోసం చేపట్టిన ప్రాజెక్టుల అవసరం తీర్చడం సాధ్యం కాదు. దుమ్ముగూడెం-సాగర్‌టేల్‌పాండ్ ప్రాజెక్టు చేపడితే కృష్ణా మిగులు జలాల ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టులకు ఎంతో కొంత మేలు జరుగుతుంది. గోదావరి వరద నీటిని కృష్ణాలోకి మళ్లించడానికి ఈ ప్రాజెక్టును ఉద్దేశించారు. దీనివల్ల ఖమ్మం, నల్గొండ, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ప్రయోజనం చేకూరుతుంది. ■

## కృష్ణ.. ఎక్కడెంత?

| రాష్ట్రం | ప్రయాణ దూరం (మైళ్లలో) | పరివాహక ప్రాంతం (చదరపు మైళ్లు) | నీటి లభ్యత (టీఎంసీలలో) |
|---|---|---|---|
| మహారాష్ట్ర | 186 | 26,805 | 760.9 |
| కర్ణాటక | 300 | 43,734 | 962.5 |
| ఆంధ్రప్రదేశ్ | 358 | 28,719 | 336.6 |

### బచావత్ కేటాయింపులు

టీఎంసీలలో

| రాష్ట్రం | కేటాయింపు | పునరుత్పత్తి ద్వారా | మొత్తం |
|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 800 | 11 | 811 |
| కర్ణాటక | 700 | 34 | 734 |
| మహారాష్ట్ర | 560 | 25 | 585 |
| **మొత్తం** | **2060** | **70** | **2130** |

## ప్రాజెక్టుల వారీగా...

టీఎంసీలలో

| ప్రాజెక్టు | బచావత్ కేటాయింపు | పునః కేటాయింపు |
|---|---|---|
| కోటిపల్లివాగు | 2.00 | 2.00 |
| కోయిల్‌సాగర్ | 3.90 | 3.90 |
| ఒన్‌శెట్టివాగు | 1.90 | 1.90 |
| దింటి | 3.70 | 3.50 |
| గుంటూరు ఛానెల్ | 4.00 | 4.00 |
| వైకుంఠపురం పిఐఎస్ | 2.60 | 2.00 |
| జూరాల | 17.84 | 17.84 |
| శ్రీశైలం | 33.00 | 33.00 |
| నాగార్జునసాగర్ | 281 | 280 |
| కృష్ణా డెల్టా | 181.20 | 152.20 |
| తుంగభద్ర ఎల్లెల్సీ | 29.50 | 29.50 |
| తుంగభద్ర హెచ్చెల్సీ | 32.50 | 32.50 |
| గాజుల దిన్నె | 2.00 | 2.00 |
| ఆర్డీఎస్ | 15.90 | 15.90 |
| పాకాల లేక్ | 2.60 | 2.60 |
| కె.సి.కెనాల్ | 39.90 | 31.90 |
| భైరవానితిప్ప | 4.90 | 4.90 |
| మూసి | 9.40 | 9.40 |
| జంటనగరాల | - | - |
| తాగునీటి సరఫరా | 3.90 | 5.70 |
| పాలేరు | 4.00 | 4.00 |
| మున్నేరు | 3.30 | 3.30 |
| లంకసాగర్ | 1.00 | 1.00 |
| వైరా | 3.70 | 3.70 |
| చిన్న నీటి వనరులు | 116.26 | 111.26 |
| ఎస్.ఆర్.బి.సి. | 0 | 19.00 |
| పులిచింతల | 0 | 9.00 |
| భీమా | 0 | 20.00 |
| చెన్నై తాగునీరు | 0 | 5.00 |
| రిటర్న్ ఫ్లో | 11 | 0 |
| మొత్తం | **811** | **811** |

## ప్రాంతాల వారీగా విద్యుత్తు ఉత్పత్తి వివరాలు..

### సీమాంధ్రలో

| విద్యుత్తు కేంద్రం | సామర్థ్యం (మెగావాట్లు) | జిల్లా |
|---|---|---|
| డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్కేంద్రం | 1,760 | కృష్ణా |
| రాయలసీమ థర్మల్ విద్యుత్కేంద్రం | 1,050 | కడప |
| అప్పర్ సీలేరు జల విద్యుత్కేంద్రం | 240 | విశాఖపట్నం |
| డొంకరాయి జల విద్యుత్కేంద్రం | 25 | తూర్పుగోదావరి |
| శ్రీశైలం(కుడి) జల విద్యుత్కేంద్రం | 770 | కర్నూలు |
| పెన్నాహోబిలం జల విద్యుత్కేంద్రం | 20 | అనంతపురం |
| నాగార్జునసాగర్ కుడికాల్వ పవర్ హౌస్ | 90 | గుంటూరు |
| గోదావరి జల విద్యుత్కేంద్రం | 1 | తూర్పుగోదావరి |
| పవన విద్యుత్తు కేంద్రం | 2 | అనంతపురం |

### తెలంగాణ

| విద్యుత్తు కేంద్రం | సామర్థ్యం (మెగావాట్లు) | జిల్లా |
|---|---|---|
| శ్రీశైలం(ఎడమ) జల విద్యుత్కేంద్రం | 900 | మహబూబ్‌నగర్ |
| కొత్తగూడెం థర్మల్ విద్యుత్కేంద్రం | 1000 | ఖమ్మం |
| కాకతీయ థర్మల్ విద్యుత్కేంద్రం | 500 | వరంగల్ |
| రామగుండం థర్మల్ విద్యుత్కేంద్రం(బి) | 62.5 | కరీంనగర్ |
| లోయర్ సీలేరు జలవిద్యుత్కేంద్రం | 460 | ఖమ్మం |
| ప్రియదర్శిని జూరాల జలవిద్యుత్కేంద్రం | 234 | మహబూబ్‌నగర్ |
| నాగార్జునసాగర్ జల విద్యుత్కేంద్రం | 815.6 | నల్గొండ |
| నాగార్జునసాగర్ ఎడమకాల్వ పవర్ హౌస్ | 60 | నల్గొండ |
| పోచంపాడు జల విద్యుత్కేంద్రం | 36 | నిజామాబాద్ |
| నిజాంసాగర్ జల విద్యుత్కేంద్రం | 10 | నిజామాబాద్ |
| సింగూర్ జల విద్యుత్కేంద్రం | 15 | మెదక్ |
| కాకతీయ జల విద్యుత్కేంద్రం | 9.16 | నిజామాబాద్ |
| లాల్‌బహదూర్ జల విద్యుత్కేంద్రం | 2 | నల్గొండ |
| జూరాల సౌర విద్యుత్తు కేంద్రం | 1 | మహబూబ్‌నగర్ |

### నిర్మాణంలో ఉన్న థర్మల్ విద్యుత్కేంద్రాలు

| విద్యుత్తు కేంద్రం | సామర్థ్యం (మెగావాట్లు) | జిల్లా |
|---|---|---|
| రాయలసీమ థర్మల్ విద్యుత్కేంద్రం(యూనిట్-6) | 600 | కడప (సీమాంధ్ర) |
| కాకతీయ థర్మల్ విద్యుత్కేంద్రం స్టేజ్-2 | 600 | వరంగల్ (తెలంగాణ) |
| శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్కేంద్రం(కృష్ణపట్నం) | 1600 | నెల్లూరు (సీమాంధ్ర) |

### నిర్మాణంలో ఉన్న జల విద్యుత్కేంద్రాలు

| విద్యుత్తు కేంద్రం | సామర్థ్యం (మెగావాట్లు) | జిల్లా |
|---|---|---|
| నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ | 50 | గుంటూరు (సీమాంధ్ర) |
| పులిచింతల | 120 | గుంటూరు (సీమాంధ్ర) |
| దిగువ జూరాల | 240 | మహబూబ్‌నగర్ (తెలంగాణ) |

## ప్రాంతాల వారీగా వైద్య ఆరోగ్యరంగం తీరుతెన్నులు

| ఆస్పత్రులు | తెలంగాణ | రాయలసీమ | ఆంధ్ర |
|---|---|---|---|
| జిల్లా ఆస్పత్రులు | 8 | 3 | 6 |
| ప్రాంతీయ ఆస్పత్రులు | 29 | 11 | 18 |
| సామాజిక ఆస్పత్రులు | 127 | 58 | 133 |
| ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు | 668 | 323 | 718 |
| ఆరోగ్య ఉపకేంద్రాలు | 4,833 | 2,224 | 5,218 |

### వైద్యసీట్లు

| ప్రాంతం | ఎంబీబీయస్ ప్రభుత్వ+ప్రైవేటు=మొత్తం | దంతవైద్యం ప్రభుత్వ+ప్రైవేటు=మొత్తం |
|---|---|---|
| తెలంగాణ | 850+ 2,100 = 2,950 | 100+ 750 = 850+ (40 ఆర్మీ దంతకళశాలలు) |
| రాయలసీమ | 650+ 350 = 1,000 | 100+ 150 = 250 |
| ఆంధ్ర | 900+ 1350 = 2250 | 40+ 860 = 900 |

### ప్రాంతాలవారీగా రహదారులు కి.మీ.ల్లో

| ప్రాంతం | జాతీయ | రాష్ట్ర | ప్రధాన జిల్లా | గ్రామీణ |
|---|---|---|---|---|
| సీమాంధ్ర | 3,055 | 6,936 | 19,834 | 13,837 |
| తెలంగాణా | 1,595 | 3,295 | 12,389 | 7,348 |

## కీలక రంగాల్లో

విభజన నేపథ్యంలో మూడు ప్రాంతాల్లోని వివిధ రంగాల పరిస్థితి ఇలా ఉంది.

| రంగం | తెలంగాణ | కోస్తాంధ్ర | రాయలసీమ |
|---|---|---|---|
| సాగు విస్తీర్ణం (లక్షల హెక్టార్లలో) | 57.02 | 51.40 | 29.18 |
| సాగు నీటి వసతి ఉన్న భూమి(లక్షల హెక్టార్లలో) | 28.64 | 30.61 | 8.60 |
| భూగర్భజలాల కింద సాగయ్యే విస్తీర్ణం (లక్షల హెక్టార్లలో) | 21.57 | 9.83 | 6.16 |
| ఆహారధాన్యాల ఉత్పత్తి(లక్షల టన్నుల్లో) | 75.01 | 92.38 | 16.62 |
| విద్యుదుత్పత్తి( 2011-12లో మిలియన్ కిలోవాట్ అవర్స్‌లో) | 13,082 | 17,336 | 9,879 |
| ఎల్.టి. విద్యుత్తు కనెక్షన్లు(లక్షల్లో) | 95.22 | 93.92 | 40.28 |
| విద్యుత్తు వినియోగం (ఎల్.టి-మిలియన్ కిలోవాట్స్ అవర్స్‌లో) | 20,584 | 11,774 | 7,026 |
| వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు | 16,83,38,000 | 5,79,61,000 | 6,46,02,000 |
| అక్షరాస్యతా శాతం | 66.46 | 68.24 | 65.53 |
| ప్రాథమిక పాఠశాలల సంఖ్య | 26,507 | 26,998 | 13,329 |
| ప్రాథమికోన్నత పాఠశాలలు | 6,478 | 5,857 | 3,086 |
| ఉన్నత పాఠశాలలు | 9,852 | 5,830 | 3,094 |
| అల్లోపతి ఆసుపత్రులు | 901 | 945 | 436 |
| ఉద్యోగుల సంఖ్య(లక్షల్లో) | 6.09 | 4.60 | 2.21 |
| కార్మికుల సంఖ్య(లక్షల్లో) | 164.53 | 156.51 | 73.19 |

## గత ఆర్థిక సంవత్సరంలో (2012-13) ప్రాంతాల వారీగా వచ్చిన ఆదాయ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. (రూ.కోట్లలో)

| ప్రాంతం | వ్యాట్ | ఎక్సైజ్ | రవాణా | రిజిస్ట్రేషన్స్ | గనులు | అటవీ | ల్యాండ్ | మొత్తం |
|---|---|---|---|---|---|---|---|---|
| ఆంధ్రా | 5,918.69 | 6,736 | 1,141.59 | 2,285.23 | 456.23 | 39.69 | 151.62 | 16,729.05 |
| రాయలసీమ | 1,146.26 | 2,382 | 408.89 | 482.35 | 355.41 | 14.03 | 20.95 | 4,809.89 |
| తెలంగాణ | 3,329.5 | 7,778 | 644.32 | 1,104.74 | 528.52 | 50.10 | 71.39 | 13,506.83 |
| హైదరాబాద్, రంగారెడ్డి | 30,632.72 | 1,178.2 | 2,098.50 | 107.36 | 64.38 | | 19.57 | 34,100.73 |
| మొత్తం | 41,027.17 | 16,896 | 3,373 | 5,970.82 | 1,447.52 | 168.20 | 263.53 | 69,146.50 |

# బాండ్ల రూపంలో అప్పులు రూ. 71 వేల కోట్లు

- బాండ్లపై తిరిగి చెల్లించాల్సిన సొమ్ము ఇది
- ఉభయ రాష్ట్రాలకు భారమే
- నడ్డి విరవనున్న వడ్డీలు
- ఆంధ్రప్రదేశ్ బాండ్లపై ఇప్పటికే ఆర్థిక సంస్థల అనాసక్తి
- పక్క రాష్ట్రాల వైపు మొగ్గు
- మరో రూ. 1800 కోట్లకు రాష్ట్రం ప్రయత్నం

బాండ్లను విక్రయించి ఇప్పటికే భారీగా తెచ్చిన రుణాలు... రానున్న రోజుల్లో రాష్ట్రానికి పెనుభారం కానున్నాయి. ఇప్పటి వరకూ ఈ మార్గంలో తెచ్చిన రూ. 71,680 కోట్లను వచ్చే తొమ్మిదేళ్లలో తప్పక తిరిగి చెల్లించాల్సి వుంటుంది. ఈలోగా దానిపైన, మళ్లీ బాండ్లను అమ్మి తెచ్చే సొమ్ముపైనా కలిపి ఎప్పటికప్పుడు చెల్లించాల్సిన వడ్డీలు నడ్డి విరవబోతున్నాయి. మరోవైపు ఈ బాండ్లను కొనేందుకు ఎగపడుతూ వచ్చిన ఆర్థిక సంస్థలు.. రాష్ట్రంలోని ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు వెనకడుగు వేస్తున్నాయి. ఫలితంగా రానున్న రోజుల్లో అప్పులను అధిక వడ్డీలకు తెచ్చుకోవాల్సిన అగత్యం ఏర్పడుతోంది.

బడ్జెట్‌ను నడిపేందుకు రాష్ట్రం ఏటా వివిధ మార్గాల్లో అప్పులను తెస్తోంది. వీటిలో కేంద్రం నుంచి తెచ్చేవి, చిన్న మొత్తాల పొదుపు, ఉద్యోగుల భవిష్యనిధి మొత్తాలతో పాటు బాండ్లను వేలంలో విక్రయించి తెచ్చే రుణాలు చాలా ముఖ్యమైనవి. ఏటా తెచ్చే అప్పుల్లో ఈ బాండ్ల ద్వారా తెచ్చేవే ఎక్కువగా ఉంటాయి. పదేళ్ల తర్వాత అసలును, ఈలోగా మూడు నెలలకొకసారి వడ్డీని చెల్లించే పద్ధతిలో ప్రతినెలా ఆర్‌బీఐ ద్వారా రాష్ట్రం ఈ బాండ్లను విక్రయిస్తూ ఉంటుంది. ఇలా గత తొమ్మిదేళ్లలో బాండ్లపై తెచ్చిన రూ. 71,680 కోట్లను 2021-22 లోగా వాటిని కొనుగోలు చేసిన బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం సొమ్ములో ఏడాదికి 3.6 శాతం చొప్పున వచ్చే మూడేళ్ల పాటు తిరిగి చెల్లించాలి. 2016-17 నుంచి పెనుభారం మొదలవుతుంది. అప్పటి నుంచి చెల్లించాల్సిన సొమ్ము ఏటా పెరుగుతూ పోతుంది. 2020-21లో 16 శాతం, 2021-22లో 20 శాతం మేర చెల్లించాలి. రాష్ట్ర విభజన కసరత్తు నేపథ్యంలో సచివాలయంలో ఇది చర్చనీయాంశమైంది. ఇది ఉభయ రాష్ట్రాలకూ భారమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.

### పెరగనున్న వడ్డీలు

పాత అప్పుల చెల్లింపులకు, కొత్తగా చేపట్టే వివిధ పథకాల కోసం మళ్లీ భారీగా అప్పులు అవసరమవుతాయి. దీంతో వీటిపై వడ్డీల భారం కూడా ఏటేటా పెరిగిపోతూ ఉంటుంది. రాష్ట్ర బడ్జెట్ ప్రకారం 2013 మార్చినాటికే బాండ్లతో సహా మొత్తం రూ. 1.54 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. వీటిపై 2013-14లో వడ్డీల రూపేణా ఏకంగా రూ. 14,518 కోట్లు చెల్లించాల్సి ఉంది. వడ్డీల భారం ప్రస్తుతం ఏటా 12 నుంచి 14 శాతం మేర పెరుగుతోంది. కొత్త రాష్ట్రాలు అనేక మౌలిక వసతులను కల్పించుకోవాల్సి ఉంటుంది కనుక ఈ వడ్డీలు, అసలు చెల్లింపులు సవాల్‌గా మారతాయి.

### ఆర్థిక సంస్థలు వెనకడుగు

రాష్ట్రం విక్రయించే బాండ్ల కోసం ఎగపడుతూ వచ్చిన ఆర్థిక సంస్థలు ఇప్పుడు వెనకడుగు వేస్తున్నాయి. జూలై 31న రూ. వెయ్యి కోట్ల విలువైన బాండ్లను విక్రయానికి పెట్టగా రూ. 1,227 కోట్ల విలువగల బిడ్లు మాత్రమే ఆర్థిక సంస్థల నుంచి వచ్చాయి. అదే రోజున పక్క రాష్ట్రం కర్ణాటక కూడా రూ. వెయ్యి కోట్ల బాండ్లను విక్రయానికి పెట్టగా రూ. 3,047 కోట్ల విలువైన బిడ్లు రావటం విశేషం. గతంలో మన రాష్ట్రానికి ఇలాంటి ఆదరణే ఉండేది. మే నెలలో రాష్ట్రం రూ. వెయ్యి కోట్ల బాండ్లను అమ్మకానికి పెట్టగా ఏకంగా రూ. 4,269 కోట్ల మేర బిడ్లు వచ్చాయి. ఎక్కువ మంది పోటీ పడితే వడ్డీ రేటు తక్కువగా ఉంటుంది. ఈ కారణంగానే మే నెలలో 7.57 శాతం వడ్డీ రేటు రాగా... జూలై 31 నాటి మొత్తాన్ని రూ. 9.84 శాతం వడ్డీకి తీసుకోవాల్సి వచ్చింది. ఈ నెల 13న మరో రూ. 1800కోట్ల బాండ్లను ప్రభుత్వం వేలానికి పెడుతోంది. ■

**బాండ్లపై తెచ్చిన రూ. 71 వేల కోట్లలో ఏటా చేయాల్సిన చెల్లింపులు (శాతాల్లో)**

| | |
|---|---|
| 2013-14 | 3.6 |
| 2014-15 | 3.6 |
| 2015-16 | 3.6 |
| 2016-17 | 4.1 |
| 2017-18 | 8.9 |
| 2018-19 | 14.6 |
| 2019-20 | 20.5 |
| 2020-21 | 16.0 |
| 2021-22 | 20.6 |

**పెరుగుతున్న వడ్డీలు (రూ. కోట్లలో)**

| | |
|---|---|
| 2011-12 | 10,560 |
| 2012-13 | 11,977 |
| 2013-14 (అంచనా) | 14,518 |

# ఉద్యోగుల బదలాయింపులు - మార్గదర్శకాలు

- కొన్ని వర్గాల ఉద్యోగులకు వెసులుబాటు
- రాష్ట్రాల విభజనలో కేంద్ర మార్గదర్శకాలు
- ఇంతకుముందు ఏర్పడ్డ కొత్త రాష్ట్రాల్లో అమలు



రాష్ట్రాన్ని విభజించినట్లైతే ఉద్యోగులను ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఇష్టానుసరంగా పంపటానికి ఆస్కారం లేదు. తప్పనిసరిగా వెళ్లాల్సి ఉన్న ఉద్యోగులకు సైతం పలు మినహాయింపులు ఉంటాయి. వీటికి సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం గతంలోనే రూపొందించింది. ఇంతవరకు ఏర్పడిన రాష్ట్రాల్లో దాదాపుగా వీటినే అమలు చేస్తూ వచ్చారు. ఇకముందు ఏర్పడే వాటికీ ఇవే ప్రామాణికం అవుతాయి.

రాష్ట్ర విభజన అనంతరం ఏ రాష్ట్రంలో ఎన్ని ఉద్యోగాలు ఉండాలో కేంద్ర ప్రభుత్వ నేతృత్వంలోని సలహా సంఘం నిర్ధారిస్తుంది. ఇలా నిర్ధారించినప్పుడు ఇక్కడి పోస్టులకంటే ఎక్కువ సంఖ్యలో ఉన్న ఉద్యోగులు కొత్త రాష్ట్రానికి వెళ్లాల్సి వుంటుంది. అలా కొత్త రాష్ట్రానికి వెళ్లటానికి ఆసక్తి కనబర్చే ఉద్యోగులు తక్కువగా ఉన్నప్పుడు.. సలహా సంఘమే కొన్ని ప్రాతిపదికల ఆధారంగా కొంతమందిని పంపిస్తుంది. ఇలా పంపేందుకు ఆయా వ్యక్తుల సొంత జిల్లా లేదా బాగా జూనియర్లను ఎంపిక చేస్తుంది. ఇష్టం లేకున్నా వీరు తప్పనిసరిగా వెళ్లాల్సి వుంటుంది. అయితే ఇలా తప్పనిసరిగా వెళ్లాల్సిన వారిలో కొన్ని వర్గాల వారికి మినహాయింపులు ఉంటాయని మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. అందువల్ల ఉద్యోగాల విభజన జరిగిన వెంటనే అందరు ఉద్యోగులూ వెళ్లిపోవాల్సిన అవసరం ఉండదు. ఉద్యోగులు, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల కేంద్ర మంత్రిత్వ శాఖ ఈ మేరకు మార్గదర్శకాలను రూపొందించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కేటాయింపుల బాధ్యతలను ఈ మంత్రిత్వ శాఖలోని రాష్ట్రపునర్ వ్యవస్థీకరణ విభాగం చూస్తుంది. 2000 సంవత్సరంలో ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలను ఏర్పాటు చేసినప్పుడు ఇటువంటి విధానాన్నే అనుసరించారు. అంతకుముందు ఏర్పడిన రాష్ట్రాల విషయంలోనూ వీటిని పాటించారు. ఉద్యోగులను వారి అభీష్టానికి వ్యతిరేకంగా కొత్త రాష్ట్రానికి పంపేటప్పుడు సలహా సంఘం ఇచ్చే మినహాయింపులు ఇలా ఉంటాయి. ■

| ఉద్యోగి వర్గీకరణ | మినహాయింపు |
|---|---|
| మహిళా ఉద్యోగులు | వారి అభీష్టం మేరకే |
| 4వ తరగతి ఉద్యోగులు | వారి అభీష్టం మేరకే |
| వికలాంగులు | వారి అభీష్టం మేరకే |
| భార్య, భర్త ఉద్యోగులైతే | కోరుకొన్న రాష్ట్రానికి ఇద్దరూ వెళ్లొచ్చు లేదా ఉండొచ్చు |
| అనారోగ్యం ఉన్నప్పుడు.. | వారి అభీష్టం ప్రకారం... (దిగువ కేసుల ప్రాతిపదికగా) |
| ★ కేన్సర్ | ఉద్యోగికి లేదా కుటుంబ సభ్యుల్లో ఇతరులకు ఉన్నప్పటికీ |
| ★ అంధత్వం | ఉద్యోగికి మాత్రమే |
| ★ గుండెకు బైపాస్ సర్జరీ, మూత్ర పిండాల మార్పిడి | ఉద్యోగికి మాత్రమే. వినతిని ఇచ్చిన రెండేళ్లలో ఆపరేషన్ జరిగినా మినహాయింపు ఇవ్వొచ్చు. |
| ★ కిడ్నీ చెడిపోయి నిరంతర డయాలసిస్ | ఉద్యోగికి లేదా కుటుంబ సభ్యులకు |
| ★ మానసిక అనారోగ్యం | ఉద్యోగికి లేదా కుటుంబ సభ్యులకు |
| ★ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు | సొంత జిల్లా లేదా వారి అభీష్టం మేరకు |

# పద్ధతి ప్రకారం పంజాబ్ విభజన

## పాఠాలు నేర్పుతున్న 47 ఏళ్లనాటి ప్రక్రియ




ఆంధ్రప్రదేశ్ విభజనలో నిరసనలు, విమర్శలు ఎదుర్కొంటున్న కేంద్ర ప్రభుత్వం 1966లో జరిగిన పంజాబ్, హర్యానాల విభజన నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది. నాటి ప్రభుత్వం పంజాబ్-హర్యానా విభజన సమయంలో అంతా పద్ధతి ప్రకారం వెళ్లింది. తొలుత ఈ డిమాండ్‌పై అధ్యయనానికి సర్దార్ హుకుంసింగ్ నేతృత్వంలో సంయుక్త పార్లమెంటరీ సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఆ సంఘం ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా రెండు రాష్ట్రాల సరిహద్దుల నిర్ధారణకు జస్టిస్ జేసీ షా నేతృత్వంలో ఇద్దరు సభ్యులతో పంజాబ్ సరిహద్దుల సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఆ రెండు సంఘాలు చేసిన సిఫార్సుల ఆధారంగా పంజాబ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-1966 తీసుకొచ్చింది. 1966 సెప్టెంబర్ 18న ఆ చట్టం పార్లమెంటు ఆమోదం పొందడం, అదే సంవత్సరం నవంబర్ 1న పంజాబ్ విడిపోవడం జరిగిపోయింది. పార్లమెంటరీ సంయుక్త సంఘం, సరిహద్దుల సంఘాల ఏర్పాటు నుంచి రాష్ట్ర పునర్విభజన వరకు మొత్తం వ్యవహారం ఏడాదిలో జరిగిపోయింది. ఆంధ్రప్రదేశ్ విభజన తరహాలోనే పంజాబ్-హర్యానాల విభజన కూడా చాలా సంక్లిష్టంగా తయారు కావడంతో కేంద్ర ప్రభుత్వం ఇరు వర్గాల మధ్య ఆమోద యోగ్యమైన పరిష్కారం కోసం అన్ని ప్రయత్నాలు చేసింది. చివరకు అవేమీ ఫలితం ఇవ్వక పోవడంతో నాటి హోంమంత్రి గుల్జారీలాల్ నందా 1965 సెప్టెంబరు 23న నాటి సమాచార ప్రసార శాఖల మంత్రి ఇందిరాగాంధీ, రక్షణ మంత్రి వైబీ చవాన్, పునరావాస మంత్రి మహవీర్ త్యాగి నేతృత్వంలో ఓ కేబినెట్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో పార్లమెంటు ఉభయ సభల సభ్యులతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని సభాపతులకు విజ్ఞప్తి చేశారు. ఆ క్రమంలో సర్దార్ హుకుంసింగ్ నేతృత్వంలో జేపీసీ ఏర్పాటైంది. ఈ కమిటీ పని మొదలు పెట్టిన తర్వాత ఆనాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి అకాల మరణం చెందారు. దీంతో కేంద్ర కేబినెట్‌లో మార్పులు జరగడంతో ఈ కేబినెట్ కమిటీ సభ్యులెవ్వరూ పార్లమెంటరీ సంయుక్త సంఘం ముందు హాజరు కాలేదు. దీని ముందుకు 7,184 విజ్ఞాపనలు వచ్చాయి. మొత్తం 28 సార్లు సమావేశమైంది. దీని ముందుకు పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు కూడా హాజరై తమ అభిప్రాయాలు చెప్పారు. 1965 సెప్టెంబర్‌లో ఏర్పాటైన సర్దార్ హుకుంసింగ్ కమిటీ 1966 మార్చి 15 కల్లా నివేదిక తయారీ పూర్తి చేసింది. ఇందులో భాజపాకు చెందిన మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి కూడా సభ్యుడిగా ఉన్నారు. భాషా ప్రాతిపదికన పంజాబ్-హర్యానాలను విడదీయాలని ఈ కమిటీ నివేదిక ఇస్తే నాడు వాజ్‌పేయి దాన్ని వ్యతిరేకించారు. అది దేశ సమైక్యతకు విఘాతం కల్గుతుందని ప్రత్యేకంగా అభిప్రాయం వ్యక్తం చేశారు.

### ఒకటే ప్రాతిపదిక

జస్టిస్ శ్రీకృష్ణ కమిటీలా పరిష్కారానికి రకరకాల మార్గాలు చూపకుండా సర్దార్ హుకుంసింగ్ కమిటీ స్పష్టంగా పంజాబ్‌ను భాషా ప్రాతిపదికన విడదీయాలని చెప్పింది. పంజాబ్‌ను విడదీసి హిందీ మాట్లాడే వారిని హర్యానాలో, కొండ ప్రాంతాల వారిని హిమాచల్ ప్రదేశ్‌లో కలిపేయాలని సూచించింది. సరిహద్దుల నిర్ధారణ కోసం ప్రత్యేక నిపుణుల కమిటీ వేసి తక్షణం చర్యలు ప్రారంభించాలని పేర్కొంది. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం జస్టిస్ జేసీ షా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1966 మే

31కల్లా పంజాబ్-హర్యానాల సరిహద్దులను నిర్ధారిస్తూ కేంద్రానికి నివేదిక సమర్పించింది.

## కేంద్రం నిర్ణయంతోనే యూటీగా చండీగఢ్

దేశ విభజన సమయంలో పశ్చిమ పంజాబ్‌తో పాటు రాజధాని లాహోర్ కూడా పాకిస్థాన్‌లో కలిసిపోయింది. దాంతో భారతదేశంలోని పంజాబ్‌కు రాజధానిగా లాహోర్‌ను తలదన్నే ఆధునిక మహానగరాన్ని నిర్మించాలని నెహ్రూ తలపెట్టారు. ప్రస్తుతం హర్యానాలో ఉన్న అంబాలా జిల్లా ఖరార్ తాలూకాలో పంజాబీల కలల నగరం చండీగఢ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిర్మాణం పూర్తి చేసుకొనే సరికి రాష్ట్ర విభజన సమస్య వచ్చి పడింది. పంజాబ్ రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హుకుంసింగ్, జస్టిస్ షా కమిటీలు రెండూ చండీగఢ్ నగరాన్ని ఎవరికి ఇవ్వాలనే విషయమై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. చండీగఢ్, రూపార్ అసెంబ్లీ నియోజకవర్గాలను పంజాబ్‌కు మినహాయించి అంబాలా జిల్లాను హర్యానాలో కలపాలని సర్దార్ హుకుంసింగ్ కమిటీ పేర్కొంది. జస్టిస్ షా కమిటీ మాత్రం చండీగఢ్‌ను కూడా అంబాలా జిల్లాతో పాటుగా హర్యానాలో చేర్చాలని సిఫార్సు చేసింది. ఖరార్ తహసీల్‌లోని చండీగఢ్‌లో హిందీ మాట్లాడే వారు 55.2 శాతం ఉంటే పంజాబీ మాట్లాడేవారు 43.9 శాతం ఉన్నట్లు పేర్కొంది. చండీగఢ్ రాజధాని ప్రాజెక్టు ప్రాంతంలో హిందీ మాట్లాడే వారు అధికంగా ఉన్నందున ఆ ప్రాంతాన్ని కచ్చితంగా హిందీ మాట్లాడే హర్యానాలో చేర్చాలని స్పష్టం చేసింది. 1961 జనాభా లెక్కల ప్రకారం చండీగఢ్ ఉన్న కరార్ తహసీల్‌లో హిందీ మాట్లాడే వారే అధికంగా ఉన్నట్లు పేర్కొంది. అందువల్ల కరార్ తహసీల్‌తో పాటు చండీగఢ్ కేపిటల్ ప్రాజెక్టును హర్యానాలోనే చేర్చాలని స్పష్టం చేసింది. అయితే ఇదే కమిటీలో సభ్యుడిగా ఉన్న ఎస్.దత్తు మాత్రం దీన్ని వ్యతిరేకించారు. చండీగఢ్‌ను పంజాబ్ రాష్ట్రంలోనే కలపాలని సూచించారు. ఇలా రెండు కమిటీల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పంజాబ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-1966లో చండీగఢ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేశారు. అయితే, చండీగఢ్ పంజాబ్, హర్యానాల ఉమ్మడి రాజధాని కాదు. పంజాబ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-1966లో ఉమ్మడి రాజధాని ప్రస్తావనే లేదు. రెండు రాష్ట్రాలు అక్కడి నుంచే పాలన కొనసాగిస్తున్నప్పటికి అది సాంకేతికంగా కేంద్రపాలిత ప్రాంతం మాత్రమే.

## నీళ్ల పంపిణీకి శాశ్వత స్వతంత్ర వ్యవస్థ

రెండు రాష్ట్రాలు నీటి అవసరాలు తీర్చే ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను ప్రత్యేక బోర్డుకు అప్పగిస్తూ పంజాబ్ పునర్విభజన బిల్లులో ప్రత్యేక నిబంధన పెట్టారు. ఇందులో ఆ రాష్ట్రంలోని బాక్రా ప్రాజెక్టు కోసం ప్రత్యేక యాజమాన్య మండలి ఏర్పాటు చేశారు. సదరు ప్రాజెక్టుపై అజమాయిషీ, నిర్వహణ బాధ్యతలను సదరు బోర్డుకే అప్పగించారు. బాక్రా పవర్ హౌస్‌పై అజమాయిషీ, నిర్వహణ, ఆపరేషన్ బాధ్యతలను కూడా ఆ బోర్డుకే అప్పగించారు. ఎప్పుడు విద్యుత్తు ఉత్పత్తి మొదలు పెట్టాలి, ఎప్పుడు నీరు వదలాలి అన్న విషయాలను ఈ బోర్డే నిర్ణయిస్తుంది. ఈ బోర్డుకు కేంద్ర ప్రభుత్వం నియమించే పూర్తి స్థాయి ఛైర్మన్‌ఉంటారు. దీంతో పాటు ప్రాజెక్టు పరిధిలోని రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు సభ్యులుగా కొనసాగుతారు. వీరితోపాటు కేంద్ర ప్రభుత్వం ఇద్దరు సభ్యులను నామినేట్ చేస్తుంది. ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే వివిధ ప్రాంతాల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇది నీటి విడుదల కార్యక్రమాలు చేపడుతుంది. ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించుకొనే అధికారం బాక్రా మేనేజ్‌మెంట్ బోర్డుకే వదిలి పెట్టారు.

## బిల్లులోనే అన్నింటికీ స్పష్టత

పంజాబ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో అన్ని అంశాలనూ పొందుపరిచారు. పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, కేంద్రపాలిత ప్రాంతం చండీగఢ్ సరిహద్దులను నిర్ధారించారు. అలాగే ఆస్తులు, అప్పుల పంపిణీ, ప్రాజెక్టుల పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వ బోర్డు ఏర్పాటు గురించీ చెప్పారు. రాష్ట్రం విడిపోయే సమయంలో రిజర్వ్ బ్యాంకుతోపాటు, వివిధ బ్యాంకుల్లో ఉన్న రాష్ట్రానికి చెందిన నగదు నిల్వలు జనాభా నిష్పత్తి ప్రకారం రెండు రాష్ట్రాల ఖాతాల్లోకి వెళ్లిపోతాయి. పన్ను బకాయిలు ఉంటే అవి ఏ ప్రాంతం నుంచి రావాల్సి ఉంటాయో అవి ఆ ప్రాంతానికే చెందుతాయి. ఏవైనా ఆస్తులు తాకట్టు పెట్టి అప్పులు తీసుకొని ఉంటే సదరు ఆస్తులు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికే ఆ అప్పుల బదలాయింపు కూడా జరుగుతుంది. ఒకవేళ అది చెల్లించకపోతే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ బాండ్ల విక్రయం ద్వారా సేకరించిన రుణాలను ఇరు రాష్ట్రాలూ పంచుకోవాల్సి ఉంటుంది. తెచ్చిన అప్పులు ఏ ప్రాంతం కోసం ఉపయోగించి ఉంటారో వాటిని ఆ ప్రాంతం వారే భరించాల్సి వస్తుంది. ■

# మూడో ఫ్రంట్‌కు అవకాశాలు !

**ఇండియాటుడే - సి ఓటర్ సర్వేలో మొత్తం 28 రాష్ట్రాల్లో 15,815 మందిని ఇంటర్వ్యూ చేయడం ద్వారా ఫలితాలను విశ్లేషించారు. సర్వేలో వెల్లడయిన ముఖ్యాంశాలు.....**

- ప్రస్తుతం యూపీఏకు 259 స్థానాలుండగా 137 స్థానాలకు పడిపోతుంది. దీనర్థం ఎన్‌డీఏ లబ్ధి పొందుతుందని కాదు. భాజపా నేతృత్వంలోని ఈ కూటమి కూడా నాలుగు స్థానాలు కోల్పోయి 155 స్థానాలకు పరిమితమవుతుంది.
- యూపీఏ కోల్పోతున్న స్థానాలు ఇతర పార్టీలకు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలకు దక్కనున్నాయి. ఇతర పార్టీలకు 251 స్థానాలు దక్కవచ్చు. ఇవన్నీ మూడో ఫ్రంట్‌గా ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నించవచ్చు.
- యూపీఏ ఓట్ల శాతం 8 శాతం పడిపోయి 29 శాతానికి పరిమితమవుతుంది. ఎన్‌డీఏ 32 శాతం ఓట్లు తెచ్చుకోనుంది. గత ఎన్నికలతో పోలిస్తే 6 శాతం అదనం.
- తెలంగాణా ఏర్పాటు చేయాలని నిర్ణయించినా కాంగ్రెస్ లబ్ధిపొందబోవడం లేదు. ప్రస్తుతం ఆ పార్టీకి ఆంధ్రప్రదేశ్ నుంచి 33 స్థానాలుండగా 26 స్థానాలు కోల్పోనుంది. తెరాస లబ్ధి పొందనుంది.
- గుజరాత్‌లో భాజపా 25 స్థానాలు గెల్చుకోనుంది. కాంగ్రెస్‌కు దక్కేవి 5 మాత్రమే.
- కర్ణాటకలో భాజపా 12 స్థానాలు కోల్పోనుంది. ఇక్కడ కాంగ్రెస్ లబ్ధి పొందనుంది.
- ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 స్థానాలకు గాను సమాజ్‌వాదీ పార్టీ 34, బీఎస్పీ 27 స్థానాలు గెల్చుకోనున్నాయి. కాంగ్రెస్ 16 స్థానాలు కోల్పోనుంది. 2009లో భాజపా 10 స్థానాలు గెల్చుకోగా ఈసారి మరో 2 స్థానాలు అదనంగా రానున్నాయి.
- పశ్చిమబెంగాల్లో 42 స్థానాలుండగా తృణమూల్ కాంగ్రెస్‌కు 21 స్థానాలకన్నా ఎక్కువ రానున్నాయి.
- మహారాష్ట్రలో శివసేన ముందంజలో ఉంది. కాంగ్రెస్ గత ఎన్నికల కంటే కొన్ని స్థానాలు కోల్పోనుంది.
- బీహార్‌లో భాజపాతో తెగదెంపులు చేసుకున్న జేడీ (యు) 10 స్థానాలు కోల్పోనుంది. భాజపా కూడా పెద్దగా లబ్ధిపొందబోవడం లేదు. ఆర్‌జేడీ గణనీయంగా లబ్ధి పొందనుంది. ఈ పార్టీకి గత ఎన్నికల్లో 4 స్థానాలు రాగా ఈసారి 14 స్థానాలు దక్కించుకోనుంది.

**శాసనసభ ఎన్నికల్లో.....**

**ఢిల్లీ (మొత్తం సీట్లు 70) :** కాంగ్రెస్ - 28 (-15), భాజపా 28(+5), ఆమ్‌ఆద్మీ పార్టీ - 9 (+9)

- ఢిల్లీలో షిలాదీక్షిత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద దెబ్బ తగలనుంది. తొలిసారిగా ఇక్కడ అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ బోణీ కొట్టనుంది.
- ప్రజాదరణలో మాత్రం షీలాదీక్షితే ముందంజలో ఉన్నారు. ఆమెకు 40 శాతం మంది మద్దతు లభించగా కేజ్రీవాల్‌కు 21 శాతం, భాజపాకు చెందిన విజయ్‌గోయల్‌కు 12 శాతం మంది మద్దతు లభించింది.

**ఛత్తీస్‌గఢ్ (90) :** కాంగ్రెస్ - 42(+4), భాజపా - 45 (-5), బీఎస్పీ - 2(0)

- కాంగ్రెస్, భాజపాల మధ్య ఓట్ల తేడా గణనీయంగా తగ్గింది.
- ప్రస్తుత భాజపా ముఖ్యమంత్రి రమణ్‌సింగ్... ప్రజాదరణ విషయంలో 42 శాతంతో ముందంజలో ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన అజిత్‌సింగ్ 21 శాతంతో, చరణ్‌దాస్ మహంత్ 12 శాతంతో ఆ తర్వాత స్థానంలో ఉన్నారు.

**మధ్యప్రదేశ్ (230) :** కాంగ్రెస్ - 92 (+21), భాజపా - 122 (-21), బీఎస్‌పీ - 6 (-1)

- ప్రజాదరణ విషయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ 57 శాతం మంది మద్దతుతో ముందంజలో ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన జ్యోతిరాదిత్య సింధియా 24 శాతంతో తర్వాత స్థానంలో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి, జాతీయ మీడియాలో హడావిడి చేసే దిగ్విజయ్‌సింగ్‌కు కేవలం 3 శాతం మంది మద్దతు మాత్రమే లభించింది. భాజపాకు చెందిన ఉమాభారతికీ 3 శాతం మందే మద్దతు తెలిపారు.

**(+అంటే గత ఎన్నికల కంటే అదనంగా వచ్చిన స్థానాలు, - అంటే కోల్పోయిన స్థానాలు) ■**

# ప్రజా సమస్యలు పరిష్కార విధానం-యువత

- డా॥ జయప్రకాష్ నారాయణ్

సమాజంలోని సమస్యల పట్ల స్పందించి వాటికి శాశ్వత పరిష్కారాలను అందించాలనే తపనతో యువత ముందుకు రావటం ముచ్చట గొలుపుతుంది. ఈవేళ కావలసిందిదే. అందుకే కడియాల సురేష్ కుమార్ రాసిన 'ప్రజా సమస్యలు పరిష్కార విధానం' అనే ఈ కరదీపికలాంటి పుస్తకాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాను.

ఈ పుస్తకంలో 50 శీర్షికల కింద వివిధ ప్రజాసమస్యలను, వాటికి పరిష్కారాలను, అలాంటి పరిష్కారాలకు వ్యవస్థీకృత ఏర్పాట్లుచేసే సిద్ధాంతాలను, వాటిని రూపొందించిన, అమలుచేసే ప్రయత్నం చేసిన పెద్దలను గురించి సురేష్ కుమార్‌గారు రేఖామాత్రంగా తెలియచెప్పారు. వీటిలో దాదాపు 50శాతం పరిష్కారాలు ప్రజలుగా మన చేతుల్లో వున్నవే. వ్యక్తిగా, కుటుంబసభ్యునిగా, గ్రామస్తునిగా, కాలనీవాసిగా, యువకునిగా, మహిళగా, రైతుగా, వృత్తిదారునిగా, ఓటరుగా, మనిషిగా మనం కాస్త బాధ్యతగా వ్యవహరించి సరిచేసుకోగలిగిన పరిష్కారాలే వీటిలో ఉన్నాయి. మనం రాజకీయ నాయకులుగా కాకపోయినా బాధ్యత తీసుకుని పౌరసత్వంతో వ్యవహరిస్తే చాలు- ఈ పుస్తకంలో పేర్కొన్న సగానికి పైగా రోజువారీ సమస్యల్ని అధిగమించి మెరుగైన జీవితాన్ని గడపగలుగుతాం.



'ప్రజా సమస్యలు పరిష్కార విధానం' పుస్తక రచయిత
**కడియాల సురేష్ కుమార్**

ఇక మిగిలిన అంశాలు వ్యవస్థతో ముడిపడినవి. అంటే, కేవలం మనం ఒక్కరం సక్రమంగా ఉంటే సరిపోదు, ఇతరులను కూడా ఆ దిశగా నడిపించేందుకు తగిన వ్యవస్థల్ని మనం నిర్మించుకోవాలన్నమాట. సమాజం ఎటుపోతే నాకేంటి, నా సంపాదన, నా సౌకర్యాలు నాకున్నాయి, ఎంతకాలం సుఖపడటానికైనా కావలసిన డబ్బు నాకుంది అనుకోవటానికి వీల్లేదు. పక్కవారిని కుట్టిన దోమ మనల్ని కూడా కుడితే వారికున్న ఆరోగ్యసమస్యలు మనకూ రావచ్చు. అందుకే స్వార్థానికి అర్థం తెలిసినవారెవరైనా – తాను సుఖంగా బతుకుతూనే సమాజానికి వీలున్నంతమేర నిరంతరం సాయం అందిస్తూనే ఉంటారు. వ్యవస్థీకృత నిర్మాణం గురించి చెబుతూ, సోషలిస్టు వ్యవస్థల గురించి, మార్క్సిస్టు దిగ్గజాల గురించి రచయిత ఎంతో ఆర్తితో వివరించారు. సమాజం గురించి, వ్యవస్థ గురించి వారు ఎంతో లోతైన పరిశీలన చేసి అన్ని రంగాలనూ పరిశీలించి ప్రజలకు ఒక మెరుగైన జీవనవిధానాన్ని అందించేందుకు నిష్కళంక ప్రయత్నం చేశారనటంలో సందేహం లేదు. అయితే ఆ క్రమంలో మానవ మనస్తత్వాన్ని విస్మరించటం వంటి కారణాల వల్ల వారి సిద్ధాంతం పరిమితులకు లోబడిపోవటాన్ని కూడా మన కళ్లముందే చూస్తున్నాం. వారి సిద్ధాంతానికి, ఆచరణకు సమగ్రతను తేవటానికి ప్రకృతి సూత్రాలన్నిటినీ పరిగణలోకి తీసుకుని, ప్రపంచదేశాల అనుభవాలను బేరీజు వేసుకుని, వాటి ప్రాతిపదికన ప్రజల సాధికారత గీటురాయిగా పనిచేసే నూతన ఉదార ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించాల్సి ఉంది. నిర్వచనానికి అందని మానవ మనస్తత్వాన్ని కట్టడి చేసే ప్రయత్నానికి బదులు, అది సరైన దిశలో పనిచేయటానికి కావలసిన ప్రోత్సాహకాలను అందించే వ్యవస్థను నిర్మించాలి. అంటే, మంచిని ప్రోత్సహించేలా, చెడును నిరుత్సాహపరిచేలా ప్రభుత్వం ఉండే ఏర్పాట్లు చేసుకోవాలి.

ఇందుకోసం, ప్రజలే ప్రభువులు, పాలకులు సేవకులుగా ఉండే ఏర్పాట్లున్న వ్యవస్థను తెచ్చుకోవాల్సి ఉంది. కులం, మతం,

ప్రాంతం, భాష, డబ్బు, లింగం వంటి పుట్టుకతో వివక్షలేవీ లేకుండా ఎదిగి ఎవరి జీవితంలో వారే హీరోగా జీవిస్తూ కూడా సమాజంలో దోపిడీకి పాల్పడే అవకాశం లేకుండా ఉండే, వ్యక్తి సుఖాన్ని, సమాజహితాన్ని అనుసంధానం చేసే వ్యవస్థను రూపొందించాల్సి ఉంది. ఒకరికి ప్రయోజనమంటే, ఇంకొకరికి నష్టమనే జీరోసమ్ గేమ్ రాజకీయాన్ని మార్చి, ఒక్కోసారి పరస్పర విరుద్ధమైనవైనా సరే, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే వ్యవస్థను తీసుకురావాల్సి ఉంది. ఇలాంటి పౌరసత్వం, నాయకత్వం గల వ్యవస్థను నిర్మించటం కోసం నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, ఉపాధి, అధికార వికేంద్రీకరణ, చట్టబద్ధపాలన, సత్వర న్యాయం, బలమైన అవినీతి నిర్మూలనా వ్యవస్థలు, లాభసాటి వ్యవసాయం, గ్రామీణ-పట్టణ ప్రాంతాల అనుసంధానం వంటి చర్యల్ని చేపట్టాలి. తగిన ఆర్థిక, రాజకీయ, పాలనా, న్యాయ, ఎన్నికల సంస్కరణలను తెచ్చుకోవాలి.

అలాగే పోరాటపంథాలో హింసకు తావులేకుండా, సృజనాత్మక పోరాట పంథాలను అభివృద్ధి చేయాలి. హింసాత్మక పోరాటాల వల్ల ఆర్థికంగా, భౌతికంగా నష్టపోయినవారికి ఆ నష్టాన్ని పూరించాలంటే చిన్నవిషయం కాదు. ఒక తుపాకీ గుండు వల్లో, పోరాటంలో మరో కారణం వల్లో అంగవైకల్యం గల వ్యక్తిని ఆదుకోవటానికి కొన్ని సంవత్సరాలు పట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అందుకే ప్రజలు భారీ త్యాగాలు అక్కర్లేకుండా తేలిగ్గా పాలనలో భాగస్వాములయ్యే, పాలనను ప్రభావితంచేసే వ్యవస్థను అమలుచేయాలి. దాంతోపాటు పిడివాద ధోరణుల స్థానంలో, హేతుబద్ధమైన, ఉదారమైన, సంశయలాభం ఎదుటివారికిచ్చేటువంటి బహిరంగ చర్చ ప్రమాణాలను పాటించాలి.

ఇలాంటి రాజ్యరహితస్థాయి ఉదార ప్రజాస్వామ్య వ్యవస్థ పూర్తిగా ఆచరణసాధ్యం. కావలసిందల్లా, మనలో నిరంతర అప్రమత్తతో కూడిన లక్ష్యశుద్ధి.

ఏ వ్యవస్థలోనైనా ప్రజాభిప్రాయమే అంతిమం. కానీ ప్రజలకు వాస్తవాలు తెలిసి స్పందిస్తున్నారా, అర్ధసత్యాలతో, తప్పుడు ప్రచారాలతో స్పందిస్తున్నారా అనేది కీలకం. ప్రజలకు నష్టం కలుగుతున్నా సరే, వారికి నచ్చే పనులు చేసి రాజకీయ లబ్ధి పొందే సంప్రదాయ నాయకత్వం స్థానంలో, ప్రజలకు మేలుచేసే పనులు చేస్తూ ప్రజాభిప్రాయాన్ని మలచగలిగే ప్రత్యామ్నాయ నాయకత్వం కావాలిప్పుడు. ఇలాంటి ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని తయారుచేయటమే ఈవేళ మనముందున్న సవాలు.

నిజానికి, మునుపెన్నడూ లేని రీతిలో సాంకేతిక పరిజ్ఞానం, యువతరం ఉండటం వల్ల మార్పు తేవటానికి గతంలో ఎన్నడూలేనన్ని అవకాశాలు కూడా ఇప్పుడు మనకున్నాయి. అయితే ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని యువతలో తయారుచేయటం అంత సులభం కాదని అనుభవాలు సూచిస్తున్నాయి. అందుకోసం అన్నిచోట్లా, అన్ని స్థాయిలలో గట్టి ప్రయత్నం నిరంతరాయంగా జరుగుతుండాలి. మనం చెప్పేది వాస్తవం కాబట్టి, కాలక్రమంలో తప్పకుండా అందుకుంటారు. యువతలో ఆదర్శభావాలు ఉండి, ఎటువంటి ముద్రలూ ఉండవు కాబట్టి వాస్తవాలకు వారు త్వరగా స్పందిస్తారు.

ఈ క్రమంలోనే, యువతలో పాతుకుపోయిన నిరాశను, వ్యతిరేక ధోరణుల్ని పారదోలుతూ మార్పు పట్ల విశ్వాసాన్ని, అందుకు దారితీసే విధానాలను గురించి పదేపదే చెబుతుండాలి. ఈ పుస్తకంలో స్వామి వివేకానంద గురించి కూడా ప్రస్తావించారు. నిజానికి వివేకానంద చేసిన గొప్పకార్యమంతా – ఆత్మన్యూనతలో మగ్గిపోతున్న భారతజాతిలో ఉత్తేజాన్ని తీసుకురావటమే. మన శరీరపు రంగు, విశ్వాసం సిగ్గుపడాల్సినవి కావని, మన వేల ఏళ్ల అవిచ్ఛిన్నమైన చరిత్ర, నాగరికత, సంస్కృతి మనందరం సగర్వంగా చాటుకోదగినవని వివేకానంద తెలియచెప్పారు. పేదలను విముక్తి చేసి, కులం, మతంతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను కల్పించటంలోనే నిజమైన ఆధ్యాత్మిక సారాంశం ఉంటుందని చాటిచెప్పిన తొలి ఆధ్యాత్మిక నేత వివేకానంద. యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపటానికి అలాంటి కృషిని ఈవేళ బహుముఖంగా చేయాల్సిఉంది. ఒక్కసారి యువత అందుకుంటే, ఇక మార్పు వెల్లువలా తన్నుకుంటూ వస్తుంది.

సానుకూల మార్పునకు దోహదం చేసే ఈ పుస్తకాన్ని ఆదరించాలని ప్రజలను, ముఖ్యంగా యువతను కోరుతూ, రచయిత కడియాల సురేష్ కుమార్ గార్కి హృదయపూర్వకంగా అభినందనలు తెలియచేస్తున్నాను.

**('ప్రజా సమస్యలు పరిష్కార విధానం' పుస్తకానికి డా॥ జయప్రకాష్ నారాయణ్ ముందుమాట ఇది)** ■

# విలువలతో కూడిన సురాజ్యానికి కృషి

## డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పిలుపు

***పౌరులుగా ఏంచేయగలం.. ఈ చీకటిని తొలగించడానికి ఏ రీతిన కృషి చేయగలం.. మన ముందున్న సమస్యలకు ఎలా పరిష్కారం చూపగలం.. అనేవి ప్రస్తుతం యువత ముందున్న ప్రశ్నలని వీటిని నెరవేర్చడానికే సురాజ్య స్థాపనకై లోక్‌సత్తా చేపడుతున్న ఉద్యమంలో యువత భాగస్వాములు కావాలని జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ఈ విషయంలో విద్యార్థులు సంధించిన ప్రశ్నలకు ఇలా స్పందించారు.***

సురాజ్య ఉద్యమంలో యువత భాగస్వాములు కావాలని లోక్‌సత్తా వ్యవస్థాపకులు, శాసనసభ్యులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. యువజన దినోత్సవం సందర్భంగా నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'కళాశాలల్లో సురాజ్య శంఖారావం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సుపరిపాలన పౌరహక్కు అని, సురాజ్యం మన జన్మహక్కుని పేర్కొన్నారు. కొత్త వ్యవస్థలతో సరికొత్త జీవనం కోసం సురాజ్య స్థాపనకు యువత నడుం బిగించాలన్నారు. మంచి వసతులు, అందరికీ ఎదిగే అవకాశాలు, అవినీతి రహితపాలన, కొత్తతరహా ఎన్నికల వ్యవస్థ, లంచాలు లేని ప్రభుత్వ సేవల కోసం సురాజ్య స్థాపన జరగాలని ఆకాంక్షించారు. గాంధీజీ కన్న కలలను సాకారం చేయడానికి సురాజ్య స్థాపన జరగాలన్నారు. దేశంలో 35 ఏళ్లలోపు వారు 65 శాతం మంది ఉంటారని వీరే దేశానికి భవిష్యత్తు అని పేర్కొన్నారు. ప్రస్తుతం చాలామందిలో నిరాశావాదం పేరుకుపోయిందని ఇది సరి కాదని అన్నారు. చైనాలో 35 లక్షల మంది ఏటా పనికి దూరం అవుతుండగా మనదేశంలో కోటి 20 లక్షల మంది పని చేసేవారు పుట్టుకువస్తున్నారన్నారు. ఎంతమంది ఉంటేనేమి నైపుణ్యాలున్న వారు, ఆత్మవిశ్వాసం కలిగిన వారు కావాలని అన్నారు. సంపదను సృష్టించే వారు దేశానికి కావాలని తెలిపారు. వనరులు, సాంకేతిక పరమైన విజ్ఞానం ఉన్నా ఎంతో మంది దేశంలో నేటికీ వైకల్యంతో జన్మిస్తున్నారని ఆవేదన చెందారు. సమస్యల భరతంపట్టి వాటికి పరిష్కారం చూపే వారు దేశానికి కావాలని అన్నారు. హెచ్‌ఎం టీవీ చీఫ్ ఎడిటర్ రామచంద్రమూర్తి మాట్లాడుతూ... యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, ఇక్కడి నుంచే సురాజ్య ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జయప్రకాష్ నారాయణ్ చర్చాగోష్ఠి ఇలా సాగింది.



*సుభాషిణి : ప్రస్తుత సమాజంలో యువత పాత్ర ఏమిటి?*

**జేపీ :** అందరికీ న్యాయం జరగాలి. సమాజం బాగుండాలనే ఆలోచన యువకుల్లో కలగాలి. ఏదో ఒక పార్టీలో చేరిపోవడం, ఎవరికో ఒకరికి ఓటు వేశామనేది కాకుండా ప్రజల కోసం ఆలోచించే వారు ముందుకు రావాలి.

*చిద్విలాస్ : రాజకీయ నాయకుల తీరంతా ఒకే రకంగా ఉంటుదన్న ఆరోపణలపై?*

**జేపీ :** సురాజ్యం కొత్త విలువలకు నాంది పలుకుతుంది. రాజకీయాల నుంచి ఎలాగైతే కొత్తది ఆశిస్తున్నామో ఓటర్ల నుంచి కూడా కొత్తదనం ఆశించాలి. తాత్కాలిక తాయిలాలకు ఆశపడకూడదు. రాజకీయ నాయకుల్లో అందరూ దొంగలని కాకుండా ఉన్న వారిలో మంచి వారిని ఎంపిక చేసుకోవాలి.

*సూర్యకిరణ్ : సురాజ్యం అంటే?*

**జేపీ :** సుపరిపాలన పౌరుల హక్కు కావాలని, సురాజ్యం జన్మ హక్కు కావాలన్నదే లోక్‌సత్తా లక్ష్యం. డబ్బుతో నిమిత్తం లేకుండా పిల్లలందరికీ ప్రమాణాలున్న చదువు, మంచి వైద్య సేవలు, ఉపాధినిచ్చే నైపుణ్యాలు, రైతుకు లాభసాటి వ్యవసాయం, మహిళలకు ప్రత్యేక ఆదాయ మార్గాలు, స్వచ్ఛమైన నీరు, పక్కా రోడ్లు, సొంత ఇల్లు, 24 గంటల విద్యుత్తు, సిటిజన్ ఛార్టర్లు, అవినీతి భరతం పట్టే లోకాయుక్త, ప్రతి జిల్లాకు అంబుడ్స్‌మన్, దామాషా పద్ధతిన ఎన్నికలు ఇది సురాజ్య ఉద్యమంలో భాగం.

*చేతన : వ్యవస్థలో రిజర్వేషన్లు ఉండాలా.. వద్దా?*

**జేపీ :** ఉన్నత కుటుంబాలకు వర్తించని రిజర్వేషన్లు కావాలి. పేదలకు చెందాలి. ముఖ్యంగా ప్రాథమిక విద్య నుంచే విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలి. రిజర్వేషన్లలో మార్పులు తేవాలి.

*చైతన్య : ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రావడం లేదు.. ఎందుకు?*

**జేపీ :** అభద్రతా భావం, సామాజిక రక్షణ తక్కువ, ఉత్పత్తుల కొనుగోలుకు ప్రభుత్వ సహకారం కొరవడడం వంటివి కారణాలు. సాంకేతిక పరంగా మరింత అభివృద్ధి సాధిస్తే మంచిది. ■

# 12 నుంచి 'కళాశాలల్లో సురాజ్య శంఖారావం' చర్చా కార్యక్రమాలు

విద్యార్థి స్థాయిలోనే యువతను సమాజ శ్రేయస్సు, తద్వారా సురాజ్య నిర్మాణం దిశగా చైతన్యపరిచేందుకు సురాజ్య ఉద్యమ రెండోదశలో భాగంగా 'కళాశాలల్లో సురాజ్య శంఖారావం' కార్యక్రమాన్ని చేపట్టామని, ఇందులో తొలి అడుగుగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఎంపిక చేసిన కళాశాలల్లో చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సురాజ్య ఉద్యమ కమిటీ వర్గాలు ఆదివారం తెలిపాయి. 'దేశ సమస్యలు – యువత భవిష్యత్తు' పేరుతో జరిగే ఈ చర్చా కార్యక్రమాలను అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆగస్టు 12న మెదక్ జిల్లా నర్సాపూర్ నుంచి ప్రారంభిస్తున్నట్టు ప్రకటించాయి.

12వ తేదీన మెదక్ నర్సాపూర్‌లోని బి.వి రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరిగే చర్చా కార్యక్రమంలో సురాజ్య ఉద్యమ స్టీరింగ్ కమిటీ కన్వీనర్, లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, సురాజ్య కమిటీ సలహాదారు, హెచ్‌ఎంటీవీ సీఈవో కె. రామచంద్రమూర్తి పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడతారు.

కళాశాలల్లో సురాజ్య శంఖారావం తొలిదశ కార్యక్రమంగా సెప్టెంబర్ 15 వరకూ వివిధ కళాశాలల్లో జరిగే ఈ చర్చా కార్యక్రమాలలో సురాజ్య కమిటీ సభ్యులతోపాటు ఇతర నిపుణులు పాల్గొని విద్యార్థులతో మమేకమవుతారు.

"భారతదేశ భవిష్యత్తును నిర్దేశించగల శక్తి జనాభాలోని 56 కోట్ల యువతకు ఉంది. వారు దేశ ప్రస్తుత స్థితిగతుల గురించి, సామాజిక–రాజకీయ–ఆర్థిక సమస్యల గురించి అవగాహన పెంచుకుంటూ పరిష్కారంలో భాగమైతే సురాజ్యం దిశగా పెద్దమార్పులు చోటుచేసుకుంటాయి. ఈ దిశగా యువతీయువకులను తీర్చిదిద్దటానికి విద్యాసంస్థలతో కలిసి పనిచేయాలని, చైతన్య కార్యక్రమాలు, నైపుణ్యాలను పెంచే శిక్షణలు నిర్వహించాలని సురాజ్య ఉద్యమం నిర్ణయించింది. ఉత్సాహం, అంకితభావంగల విద్యార్థులు కమిటీగా ఏర్పడి సురాజ్య కార్యక్రమాలను అమలుచేయవచ్చు. కళాశాల కార్యక్రమాలతో పాటు, వ్యక్తిగతంగా, సమష్టిగా చుట్టూ ఉన్న సమస్యలపై విద్యార్థులు చేపట్టే కార్యక్రమాలకు కూడా ఉద్యమం తగిన సహకారాన్ని అందిస్తుంది" అని సురాజ్య ఉద్యమ కమిటీ వర్గాలు ఒక ప్రకటనలో వివరించాయి. ■

# సర్పంచులుగా ఎన్నికైన లోక్‌సత్తా అభ్యర్థులు

| సర్పంచులుగా ఎన్నికైన లోక్‌సత్తా అభ్యర్థులు | | | |
|---|---|---|---|
| జిల్లా | మండలం | గ్రామం | ఎన్నికైన సర్పంచ్ పేరు |
| 1. కృష్ణా | కృత్తివెన్ను | మాట్లం | టి. వెంకటలక్ష్మి |
| 2. కరీంనగర్ | కొహెడ | సముద్రాల | బొల్లం రవి |
| 3. తూ.గోదావరి | కోరుకొండ | బొల్లెద్దుపాలెం | ఆర్. లక్ష్మి |
| | ఐనవల్లి | నల్లచెరువు | ఎస్. వెంకటేశ్వరరావు |
| 4. కర్నూలు | కల్లూరు | పందిపాడు | వెంకటేశ్వర్లు |
| ఉపసర్పంచులు | | | |
| 1. తూ.గోదావరి | కాజులూరు | తనుమల్ల | బుల రామతులసి |
| 2. గుంటూరు | గురజాల | జనపాడు | ఎం. కోటేశ్వరరావు |

**ఇతర జిల్లాల సమాచారం పంచాయితీ ఎన్నికలపై సమీక్షలు వచ్చే సంచికలో....**

| శ్రీకాకుళం జిల్లా | | |
|---|---|---|
| మండలం | పంచాయితీ | వార్డు మెంబర్ |
| 1. పొలకి | రహిమాన్‌పురం | పలిన అప్పన్న |
| 2. పొలకి | రహిమాన్‌పురం | ఉప్పాడ వెంకటి |
| 3. పొలకి | బార్జిపాడు | పుడి జయమ్మ |
| 4. పొలకి | బార్జిపాడు | పుడి కామేష్ |
| 5. పొందూరు | పొందూరు | వి. రాజ్యలక్ష్మి |
| 6. పొందూరు | కింతాలి | పి. అన్నాజీరావు |
| 7.పొందూరు | కింతాలి | పి. కామినాయుడు |
| 8. బుర్జా | కలపర్తి | బి. శ్రీనివాసరావు |
| 9. బుర్జా | కలపర్తి | ఎం.కృష్ణారావు |
| 10. ఇచ్ఛాపురం | కొతరి | బి. కరుణయ్య |
| 11. పాతపట్నం | కొరసావడ | బి. లక్ష్మి |
| 12. పాతపట్నం | కొరసావడ | జి. అర్జున్ |
| 13.ఆముదాలవలస | బెలమామ్ | టి.అప్పలనాయుడు |
| 14.ఆముదాలవలస | బెలమామ్ | పి.పార్వతమ్మ |
| 15.ఆముదాలవలస | బెలమామ్ | టి. పుణ్యవతి |
| 16. ఆముదాలవలస | బెలమామ్ | జి. ఈశ్వరమ్మ |
| 17. ఆముదాలవలస | బెలమామ్ | టి.అప్పలనాయుడు |
| 18. ఆముదాలవలస | బెలమామ్ | ఎస్. శ్రీనివాస్ |

మరికొన్ని ఫలితాలు పక్క పేజీలో....

| గుంటూరు జిల్లా | | |
|---|---|---|
| మండలం | పంచాయితీ | వార్డు మెంబర్ |
| 1. నకరేకల్లు | గుండ్లపల్లె | మౌలాభి యస్.కె. |
| 2. నకరేకల్లు | గుండ్లపల్లె | పగడాల బుధియా |
| 3. సత్తెనపల్లె | పెడనెమలిపురి | వేముల రామాన్‌జీ |
| 4. సత్తెనపల్లె | పెడనెమలిపురి | సత్ర పార్వతీ |
| 5. గురజాల | జనపాడు | జె. శ్రీనివాసరావు |
| 6. చేబ్రోలు | చేబ్రోలు | ఆర్. రవి |

| కృష్ణా జిల్లా | | |
|---|---|---|
| మండలం | పంచాయితీ | వార్డుమెంబరు |
| 1. అగిరిపల్లె | వటుకురిపాడు | యలమర్తి మణెమ్మ |
| 2. బంతుమిల్లి | గోరంపూడి | తిరుమలశెట్టి రాజు |
| 3. కృత్తివెన్ను | మాట్లం | కొల్లాటి నాగరాజు |
| 4. కృత్తివెన్ను | మాట్లం | టి. కనక కుమారి |
| 5. కృత్తివెన్ను | మాట్లం | బర్రె లక్ష్మి |
| 6. కృత్తివెన్ను | మాట్లం | సి.హెచ్. కనకదుర్గ |
| 7. కృత్తివెన్ను | మాట్లం | టి. పరశురాముడు |
| 8. కృత్తివెన్ను | మాట్లం | టి. అనంతలక్ష్మి |
| 9. కృత్తివెన్ను | మాట్లం | ఎ. దుర్గ |
| 10. కృత్తివెన్ను | మాట్లం | టి. అనసూయ |

# ఉద్యమం ఉధృతికి కేంద్రమే కారణం



## విశాఖపట్టణం

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు విషయంలో రెండు ప్రాంతాల ప్రజలతో విస్తృత స్థాయి సంప్రదింపులు జరపకుండానే కేంద్రం నిర్ణయం తీసుకోవడం వలన రాష్ట్రం తగలబడిపోతుందని సంక్షోభం పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫల మయ్యిందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. ప్రజల అపోహలను కేంద్రం త్వరితగతిన తీర్చాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెండు ప్రాంతాల ప్రయోజనాలు కాపాడటంలో మన నాయకులు విఫలమయ్యారని పార్టీ నగర అధ్యక్షులు యన్. వేణుగోపాల్ అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి డి.జోయ్, పార్టీ ఉత్తర, తూర్పు అధ్యక్షులు ఎం.ఎస్.ఎన్.మూర్తి, గొట్టిపాటి సాంబశివరావు, చిప్పాడ ఉదయ్, రామ్మోహన్, రవి, కిషోర్, అనిల్, ఈశ్వర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పెదవాల్తేరు ఫ్లైఓవర్‌కి తిలక్ పేరు పెట్టాలి

జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. నిధులతో ఏర్పాటు చేసిన ఫ్లై ఓవర్ వంతెనకు స్వాతంత్ర్య సమరయోధుడు, తొలితరం పార్లమెంటు సభ్యుడు కందాళం సుబ్రహ్మణ్యం తిలక్ పేరును పెట్టాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి బీశెట్టి బాబ్జీ కోరారు.

## పంచాయితీలలో ఎన్నికైన లోక్‌సత్తా అభ్యర్థులు

**అదిలాబాద్ జిల్లా**

| మండలం | పంచాయితీ | వార్డు మెంబర్ |
|---|---|---|
| 1. గుడి హత్నూర్ | మన్నూర్ | సుధీప్‌గౌడ్ |

**కర్నూలు జిల్లా**

| మండలం | పంచాయితీ | వార్డు మెంబర్ |
|---|---|---|
| 1. కల్లూర్ | లక్ష్మిపురం | ప్రభుదాస్ |
| 2. ఓర్వకల్ | సకునాల | ఎం.ఆర్.చంద్ర |
| 3. పత్తికొండ | పత్తికొండ | పీర్ మొహిద్దీన్ |

**తూర్పు గోదావరి జిల్లా**

| మండలం | పంచాయితీ | వార్డుమెంబర్ |
|---|---|---|
| 1. కాజులూరు | ముతుకుమిల్లి | దేవు నాగమణి |

## ఆంటోని కమిటీకి చట్టబద్ధత ఏది?

### జామి

తెలంగాణ ప్రకటన సందర్భంగా రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితులపై సోనియాగాంధీ నియమించిన ఆంటోని కమిటీ ప్రభుత్వపరంగా వేసిన కమిటీ కాదని కేవలం పార్టీ పరంగా వేసిన కమిటీ అని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అభివర్ణించారు. ఇలాంటి కమిటీలు అందరి అభిప్రాయాలు సేకరించడానికి ఎలా దోహదం చేస్తాయని తీవ్రంగా విమర్శించారు.

# పార్కు కబ్జాదారుల ఆట కట్టించాలి

# సురేష్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

దేశమంతా స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకుంటున్న వేళ పట్టపగలు రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉన్న వెంకటరమణ కాలనీలో అధికార పార్టీ ముసుగేసుకుని నేతలుగా చెలామణి అవుతున్న కొందరు




దుండగులు చెలరేగిపోయి స్థానికులపై దాడులకు తెగబడ్డారు. జాతీయ జెండాను పీకేసి కాలనీ వాసుల ఉమ్మడిఆస్తిగా ఉండే పార్కు స్థలం కోసం డిమాండ్ చేసిన వారిపై విచక్షణా రహితంగా భౌతిక దాడికి దిగారు. దుండగుల దెబ్బలకు లోక్‌సత్తా పార్టీ నేత, సీనియర్ జర్నలిస్టు సురేష్ వెలుగూరికి తీవ్ర గాయా లయ్యాయి. ఆయనను దుర్భాష లాడుతూ ఇష్టమొచ్చినట్టు కొట్టారు. దెబ్బలకు తాళలేక కుప్పకూలిన సురేష్ సుమారు ఇరవై నిమిషాల తర్వాతగానీ స్పృహలోకి రాలేకపోయారు. పైకి ఆనవాళ్లు కనిపించకుండా శరీరాన్ని కుళ్లబొడిచే రీతిలో దెబ్బలు కొట్టటంలో ఆరితేరిన వారే ఆ దాడికి పాల్పడ్డారు. కాలనీవాసుల్ని కూడా దుండగులు భయభ్రాంతులకు గురిచేసి చెదరగొట్టారు. ఇందులో పోలీసుల పాత్ర కూడా ఉందన్న అనుమానాన్ని స్థానిక ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. గాయపడిన సురేష్‌ని లోక్‌సత్తా పార్టీ నేతలు బంజారాహిల్స్ కేర్ ఆసుపత్రికి తరలించే సమయంలో పోలీసులు వచ్చారు.

ఘటన వివరాలిలా ఉన్నాయి... తమ కాలనీలో పర్యావరణ పరిరక్షణ కోసం, తాము కాస్త సేదతీరటం కోసం పార్కును అభివృద్ధి చేసేందుకు వెంకటరమణ కాలనీవాసులు సుమారు 50 ఏళ్ల క్రితం 625 గజాల స్థలాన్ని తమ సొంత డబ్బుతో హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌కి బహుమతిగా ఇచ్చారు. ఎంసీహెచ్ పత్రాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నాయి. అయితే పార్కు స్థలాన్ని కాపాడటంలో, అభివృద్ధి చేయటంలో ఎంసీహెచ్ నిర్లక్ష్యాన్ని, ఉదాసీనతను ఆసరాగా చేసుకుని గత పాతికేళ్లుగా కొందరు రాజకీయ అండతో



ఆగస్టు 16న లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, బీజేపీ నేత దత్తాత్రేయ పార్కు స్థలాన్ని సందర్శించి పార్కు కబ్జా సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

పార్కు స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నాలు చేస్తున్నారు, కాలనీ ప్రజలు వాటిని తిప్పికొడుతూ స్థలాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. స్థలానికి అసలు హక్కుదారైవుండీ తన బాధ్యతను జీహెచ్ఎంసీ గాలికి వదిలేయటంతో, కొందరు ఆ స్థలాన్ని కోర్టులోకి లాగి కబ్జాచేసే యత్నం చేశారు. ఈ లసుగుల్ని ఆసరాగా చేసుకుని, తాజాగా స్థానిక (పంజాగుట్ట) కార్పొరేటర్ పార్కు స్థలాన్ని తన భార్య, బావమరిది, బావమరిది భార్య, ఆయన తల్లి పేరిట గుట్టుచప్పుడు కాకుండా అగ్రిమెంట్ చేయించుకున్నారు. ఈ పార్కు స్థలం జీహెచ్ఎంసీకి చెందినదేనని, పార్కుగా అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిందని తెలిపేందుకు నిర్దిష్ట ఆధారాలున్న కాలనీవాసులు ఆ అంశంపై అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు, రాజకీయ వ్యవస్థను కదిలించేందుకు శాంతియుత ఆందోళనాకార్యక్రమాలు చేపట్టారు.

జూన్ 22, 2013న వెంకటరమణ కాలనీ ప్రజలు రిలే నిరాహారదీక్షలు కూడా చేశారు. అప్పుడు లోక్‌సత్తాతోపాటు బీజేపీ, తెలుగుదేశం, వైకాపా, టీఆర్ఎస్, వామపక్ష పార్టీల నేతలు సంఘీభావం తెలియచేశారు. ఆగస్టు 15న పార్కు స్థలంలో జాతీయ జెండాను ఎగరవేసి కబ్జాకు వ్యతిరేకంగా నిరసన తీర్మానం చేశారు. లోక్‌సత్తా నేతలతోపాటు బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ, ఆమ్‌ఆద్మీ నేతలు, స్థానిక కాలనీ వాసులు ఇందులో పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ పూర్తయి అతిథులు వెళ్లిపోగానే, పంజాగుట్ట డివిజన్ కాంగ్రెస్ నాయకులు గుంపుగా అక్కడికి చేరుకుని జెండాను కర్రతో సహా పీకేశారు. తర్వాత దానికి ఎగరవేసిన వ్యక్తులపై దాడికి దిగారు. సురేష్‌ను విచక్షణారహితంగా కొట్టారు. దాడికి పాల్పడినవారిలో కొందరు అక్కడ్నుంచి ప్రేమ్‌నగర్, తుమ్మలబస్తీకి వెళ్లి బీజేపీ నేతలు సతీష్ మల్లెల ప్రకాష్‌లని కొట్టారు.

బంజారాహిల్స్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేష్‌ని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకునేలా చేస్తామని, సురేష్‌కి, వెంకటరమణ కాలనీ ప్రజలకు అన్నిరకాలుగా లోక్‌సత్తా పార్టీ అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం ఈ ఘటనను నిరసిస్తూ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ విభాగం అధ్యక్షుడు దోసపాటి రాము నేతృత్వంలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్ ఎదుట లోక్‌సత్తా నేతలు నోటికి నల్లవస్త్రం కట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. బీజేపీ కార్యకర్తలు కూడా వీరికి జత కలిశారు. ఈ విషయాన్ని ఇంతటితో వదిలేదిలేదని, పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టామని, అన్ని పార్టీలతో సంప్రదించి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి ప్రజాప్రయోజనకరంగా పార్కు సమస్యను పరిష్కరిస్తామని రాము తెలిపారు. ■

## సురేష్‌కి జర్నలిజంలో అనుభవం, లోక్‌సత్తాతో అనుబంధం

సురేష్ వెలుగూరికి జర్నలిజంలో విశేషానుభవం ఉంది. ప్రచురణకర్తగా పలు అంశాలపై పుస్తకాలను ప్రచురించారు. 1990ల తొలినాళ్లలో జర్నలిస్టుగా కెరీర్‌ని ప్రారంభించి, ప్రస్తుతం ఆయన టెక్నికల్ రైటింగ్ కన్సల్టెంట్‌గా ఉన్నారు. విద్యార్థులకు ఇంగ్లీష్, కమ్యూనికేషన్ అంశాల్ని బోధిస్తున్నారు. రిపోర్టర్‌గా, సబ్‌ఎడిటర్‌గా వివిధ దినపత్రికలలో పనిచేసిన అనంతరం పెంటాసాఫ్ట్, సత్యం ఇన్ఫోవే సంస్థలలో ఐటీ సేవలు అందించారు.

1997లో వీఎంఆర్‌జి ఇంటర్నేషనల్ పేరుతో మీడియా శిక్షణాకేంద్రాన్ని ప్రారంభించి భాషా సేవల రంగానికి విస్తరించారు. 2011లో 'వీఎంఆర్‌జి ఇంప్రెక్స్ స్కూల్ ఆఫ్ లీడర్‌షిప్ మేనేజ్‌మెంట్' పేరుతో నవ్యతరం నాయకత్వ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. టెక్నికల్ రైటింగ్, అనువాద సేవలకు సంబంధించి 40కిపైగా వర్క్‌షాప్‌లని నిర్వహించారు.

లోక్‌సత్తా ఉద్యమసంస్థకు సంబంధించిన కార్యక్రమాలలో సురేష్ పాల్గొనేవారు. తొలినుంచీ పార్టీ మీడియా వ్యవహారాలు, పార్టీ సాహిత్యం తయారీలో తన వంతు తోడ్పాటు నందిస్తున్నారు. పార్టీ భావజాలంతో వివిధ పత్రికలకు వ్యాసాలు రాస్తుంటారు. హైదరాబాద్ బుక్ ఎగ్జిబిషన్‌లో లోక్‌సత్తా పార్టీ స్టాల్‌ని కూడా ఏర్పాటుచేసి లక్షలాదిమంది సందర్శకులలో పార్టీ ఆలోచనల్ని అందుబాటులోకి తేవటంలో సురేష్‌ది ప్రధాన పాత్ర. ఫేస్‌బుక్ వంటి సాంఘిక మాధ్యమాల ద్వారా కూడా సురేష్ లోక్‌సత్తా భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారు. ■

# లోక్‌సత్తా పార్టీలో పలువురి చేరిక



## అమీర్‌పేట

పలువురు యువకులు లోక్‌సత్తా పార్టీలో చేరారు. అమీర్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమం ద్వారా యువకులకు నియోజకవర్గం అధ్యక్షులు బొంతు సాంబిరెడ్డి పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. నేతలు అలివేలు, సాయికుమార్, ప్రసాద్, వివేక్, రాజేష్, పృధ్వీ, సునీల్, గణేష్‌రాజు, పి.గణేష్ పాల్గొన్నారు.

### గ్రీన్ జూబ్లీహిల్స్ :

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గ్రీన్ జూబ్లీహిల్స్ పేరుతో పాఠశాల విద్యార్థుల అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నియోజకవర్గ పార్టీ అధ్యక్షులు బొంతు సాంబిరెడ్డి పేర్కొన్నారు. శ్రీకృష్ణానగర్‌లోని జ్ఞాన క్షేత్ర, యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో జరిగాయి. అలాగే గుడ్ సిటిజన్స్ హైస్కూల్, సరస్వతీ మందిర్, రహ్మత్ నగర్‌లోని శాంతి విద్యానికేతన్ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు జరిగాయని తెలిపారు.

# ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యమే ప్రజలకు శాపం



## ఫిలింనగర్

జూబ్లీహిల్స్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యమే ఇక్కడి ప్రజలకు శాపంగా మారిందని లోక్‌సత్తా పార్టీ సీనియర్ నేత నాగేంద్రబాబు విమర్శించారు. పలువురు ముఖ్యనేతల నివాసాలు ఇక్కడే ఉన్నా పేదల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. జూబ్లీహిల్స్‌లోని మస్తాన్‌నగర్, అంబేద్కర్ నగర్‌లో ఆయన పర్యటించారు. స్థానికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అంబేద్కర్‌నగర్‌లో ఏళ్ల తరబడిగా వుంటున్న తమకు ఇళ్ల పట్టాలు కావాలని కోరుతున్నా నేతలు స్పందించడం లేదని అక్కడివారు చెప్పారు. స్థానికంగా నిర్మిస్తున్న కొన్ని పక్కా ఇళ్లు అర్థంతరంగా మధ్యలోనే ఆగిపోయాయని, అవి త్వరగా పూర్తయితే ప్రయోజనంగా ఉంటుందని చెప్పారు. అందుబాటులో రేషన్ దుకాణం లేదని ఆవేదన తెలిపారు. మస్తాన్‌నగర్‌లో అనేకమందికి రేషన్‌కార్డులు కూడా లేవని చెప్పారు. ఇందుకు స్పందించిన నాగేంద్రబాబు లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో అధికారులపై ఒత్తిడి పెంచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవరగ& పార్టీ నేత సాంబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ ఆరోపించారు. స్థానిక బాలాజీ థియేటర్ కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాల నుంచి తెలంగాణ సమస్య వల్ల రాష్ట్రం రావణకాష్టంలా మారిందన్నారు. ఇటువంటి తరుణంలో ప్రజాస్వామ్యబద్ధంగా, భవిష్యత్తు పరిణామాలను ఊహించకుండా రాజకీయ స్వార్థంతో నిరంకుశ నిర్ణయాలతో రాష్ట్రం భ్రష్టుపట్టిందన్నారు. లోక్‌సత్తా జిల్లా కార్యదర్శి దయానంద్‌తో పాటు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శివరామారావు, ఆర్. సుధాకర్, చింతలపూడి అప్పలరాజు, తిప్పాన కోటేశ్వర్రావు, ఎర్నాయుడు, మొల్లేటి నాయుడు, రాయి పద్మావతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**విజయనగరం**

# సమస్యల పరిష్కారానికి కలెక్టర్ హామీ



జిల్లాలో గవర్నమెంట్ హైర్ వెహికల్స్ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ కాంతిలాల్‌దండే హామీ ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో సభ్యులంతా జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ హైర్ వెహికల్స్ ఓనర్స్, డ్రైవర్స్ 2006వ సంవత్సరం నుంచి అధికారులకు ఉత్తమ సేవలు అందిస్తున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. చాలా కాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. త్వరగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కాంతిలాల్‌దండే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**విజయనగరం**

# నియోజకవర్గ ప్రజలతో జేపీ ముఖాముఖి



## ఓల్డ్ బోయిన్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఉదయం 10 గం॥ల నుండి ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని వినాయక్‌నగర్‌లో గల సౌభాగ్య అపార్ట్‌మెంటులో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ సమస్యలు డా॥ జేపీ గారికి తెలియజేశారు. వాటిలో వినాయక్‌నగర్ రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కాలేదని ఫిర్యాదు చేయగా అక్కడికి విచ్చేసిన డిసి గంగాధర్‌రెడ్డిగారిని అడుగగా ఒక వారంలో పని పూర్తయ్యేలా చూస్తానని అన్నారు. వినాయక్‌నగర్‌లోని చెత్త డంపింగ్ సమస్యను డా॥ జేపీగారి ఆధ్వర్యంలో బాలానగర్ మెయిన్‌రోడ్డు మీద నిర్మించిన కొత్త డంపింగ్ యార్డుకు తరలింపు పనులు ప్రారంభం జరిగింది. నవజీవన్‌నగర్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరగా త్వరలోనే ఏర్పాటు చేయిస్తానని డిసి హామీ ఇచ్చారు. పూలబస్తీ డ్రైనేజీ సమస్య గురించి ల్యాండ్ ఎక్విజేషన్ గురించి, దిల్‌కుష్‌నగర్ రోడ్డు స్థల సేకరణ గురించి కలెక్టర్‌తో మాట్లాడారు. అంజయ్యనగర్‌లో వాటర్ కనెక్షన్స్ ఇవ్వడం లేదని తెలుపగా వెంటనే ఆ పనులు ప్రారంభం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసి గంగాధర్‌రెడ్డి, డిఈ అశోక్‌రెడ్డి, ఏఈ యుగంధర్, హెల్త్ ఆఫీసర్ రమేష్‌గుప్తా, సందీప్‌సింగ్, వాటర్ బోర్డు మేనేజర్ అప్పలనాయుడు, లోక్‌సత్తా నేతలు ఉపేందర్ రెడ్డి, కొమ్ము సత్తయ్య, ఎన్.శ్రీనివాసన్, బాదినేని ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, సులోచన, భాస్కర్‌రావు, క్రిష్ణరెడ్డి, అంజనేయులు, చంద్రశేఖర్, కాలనీ కమిటీలు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా వార్డు సభ్యుడికి అభినందన

తనికెళ్లలో లోక్‌సత్తా పార్టీ తరపున పోటీచేసి 12వ వార్డు సభ్యుడిగా ఎన్నికైన చాట్ల భాస్కర్‌ను ఆ పార్టీ నాయకులు గ్రామంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అభినందించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్లకుంట బాలస్వామి మాట్లాడుతూ లోక్‌సత్తా గ్రామంలో ఆదర్శవంతమైన పాలన అందించడానికి కృషి చేస్తుందన్నారు. ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలని భాస్కర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల రాధాకృష్ణ, ఇరుమళ్ల లాలయ్య, రాములు, జయ, శ్రీదేవి, లాలమ్మ, సుజాత పాల్గొన్నారు.



## తనికెళ్ల



కూకట్‌పల్లి నియోజకవర్గంలో మీ సేవా కేంద్రం ప్రారంభోత్సవంలో
కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ, రాష్ట్ర మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్యే డా॥ జేపీ




మల్కాజ్‌గిరిలో బోనాలు

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15




To,

**Book-Post**

PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad